www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 10 | జూన్ | 2026 పేజీలు : 8

## కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి

**సురేష్, సాబీర్‌పాషా**




**ప్రజాపక్షం/ఖమ్మం :** పెట్రో, గ్యాస్ ధరలను తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న బుధవారం జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా పిలుపునిచ్చారు. ఉదయం 10గంటలకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమం జరుగుతుందన్నారు. ధరల తగ్గింపు, హామీల అమలు కోసం జరిగే ఈ ఆందోళనకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం హామీల అమలుకు పూనుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం తగు రీతిలో స్పందించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

# ఖమ్మంలో దారుణ ఘటన




**-మైనర్‌పై లైంగిక దాడి.. హత్యాయత్నం**
**-నిందితుడిని కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల డిమాండ్**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మంలో దారుణ ఘటన చోటు చేసుకోగా బాధితురాలు అపస్మారక స్థితిలో ఉండడంతో ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఓ కామాంధుడు మైనర్‌పై లైంగిక దాడికి పాల్పడటమే గాక ఆమెను అంతం చేసే క్రమంలో నాలుగు అంతస్తుల భవనం పై నుంచి కిందకు నెట్టాడు. ఈ దారుణ ఘటన

మిగతా 2లో..

# సహకార రంగానికి పూర్వవైభవం

**-చెరువుమాదారంలో డీసీసీబి బ్రాంచి ప్రారంభం**
**-జాతీయబ్యాంకుకు దీటుగా ఆధునిక సేవలు: మంత్రి పొంగులేటి**
**-ఏడాదిలోనే పాలేరుకు గోదావరి జలాలు: మంత్రి తుమ్మల**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** గ్రామీణ ప్రాంతాల ప్రజలకు, రైతులకు, స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకింగ్ సేవలను మరింత సులభంగా చెంతకు చేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. నేలకొండపల్లి మండల పరిధిలోని చెరువు మాదారం గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన డీసీసీబి శాఖను ఖమ్మం ఎం.సీ.రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., సీపీ సునిల్‌దత్‌లతో కలిసి మంత్రులు సంయుక్తంగా ప్రారంభించారు. అనంతరం మంత్రులు మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఒకప్పుడు కోపరేటివ్ బ్యాంకింగ్ అంటే కేవలం రైతులకు మాత్రమే అనే భావన ఉండేదని, నేడు రూపురేఖలు మార్చి ప్రతీ పెద్ద గ్రామాల్లో ఓ బ్రాంచి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు, కమర్షియల్ బ్యాంకులతో పోటీ పడుతూ జాతీయబ్యాంకులను మరిపించేలా డీసీసీబీలు ఆధునిక ఆర్థికసేవలు అందిస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు. నేలకొండపల్లి, పాలేరు ప్రాంతాలు అన్నిరకాల పంటలు పండించే సస్య శ్యామలమైన నియోజకవర్గమని, నాగార్జునాసాగర్ జలాలతోపాటు భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందుతుందని రాబోయే ఏడాది కాలంలోనే ఇక్కడికి గోదావరి జలాలు కూడా తీసుకొచ్చి ఈ ప్రాంతాన్ని పునీతం చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. పొరుగు రాష్ట్రంలో మక్కలను కొనేనాథుడే లేక అక్కడి రైతులు కూడా తెలంగాణ రైతుల పేరుతో అమ్ముకునేలా మన మార్కెటింగ్ వ్యవస్థ బలంగా ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులను అనేకరకాలుగా ఇబ్బందులు పెట్టేవారని, ఈనాడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. అధికారంలోకి వచ్చిన

మిగతా 2లో..

# అంపశయ్యపై ప్రభుత్వ విద్య..!

**-సిఎం ప్రకటనతో గందరగోళం**
**-బడుల మూతతో విద్యకు దూరం కానున్న పేద వర్గాలు**
**-ప్రైవేటును నియంత్రించలేకే అన్న ఆరోపణలు**






**ప్రజాపక్షం/ఖమ్మం :** రకరకాల సమస్యలతో కూనరిల్లుతున్న ప్రభుత్వ విద్య అంపశయ్యపైకి చేరే పరిస్థితి ఏర్పడింది. 26వేలకు పైబడి ఉన్న ప్రభుత్వ పాఠశాలలను నాలుగువేలకు కుదిస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది. చేతాడు కొనలేక బావి పూడ్చుకున్నారన్న చందంగా ఉంది ముఖ్యమంత్రి ప్రకటన. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి ప్రణాళికలను రూపొందించాల్సింది పోయి అవసరం లేదు బడులు మూసేస్తాం ఉన్నోడికి అద్భుతం చూపిస్తాం అంటే ఎలా. వాస్తవానికి రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ విద్య పరిస్థితి నానాటికి తీసికట్టు నానంబొట్టు అన్న సామెతలా తయారైంది. ప్రభుత్వ ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించకపోవడం, ప్రభుత్వం వైపు నుంచి పర్యవేక్షణ కొరవడటం, మౌలిక వసతుల కల్పన జరగకపోవడం వీటితో పాటు విద్యార్థుల తల్లి దండ్రుల్లో ప్రభుత్వ విద్య పట్ల నమ్మకం కోల్పోవడం వెరసి ప్రభుత్వ విద్య అంపశయ్యపైకి చేరింది. క్షేత్రస్థాయిలో ఏమి జరుగుతుంది, ఏ ఉపాధ్యాయుడు ఏమి చేస్తున్నాడు అని తెలుసుకునేందుకు దశాబ్దన్నర కాలంగా మండల విద్యాశాఖాధికారుల నియామకం జరగడం లేదు. ఆ మండలంలోని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకే మండల విద్యాశాఖ బాధ్యతలు కేటాయించడంతో అటు పాఠశాల ఇటు మండలంలో ఏ బాధ్యతకు న్యాయం చేయలేక మొత్తం వ్యవస్థ చతికిలపడుతుంది. క్రమేపి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నా సరైన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందింది. అధికారంలో ఎవరు కొనసాగినా ప్రభుత్వ విద్య పట్ల నిర్లక్ష్య ధోరణి వ్యవహరించారే తప్ప ప్రభుత్వ విద్య పురోగమనానికి సరైన చర్యలు తీసుకోలేదు. ప్రైవేటు విద్యా సంస్థలకు ఇష్టాను సారంగా అనుమతులు ఇవ్వడం, నిబంధనలకు తూట్లు పొడిచి గల్లి గల్లీకో ప్రభుత్వ పాఠశాల వెలిసిన నిబంధనలపై ప్రశ్నించకపోవడం కూడా మరో కారణం. ప్రభుత్వ విద్యాలయాల్లో కంటే ప్రైవేటు

మిగతా 2లో..

# ఖమ్మంలో దారుణ ఘటన

(మొదటిపేజీ తరువాయి)
ఖమ్మం నగరంలోని రాపర్తి నగర్‌లో ఈనెల ఆరున జరిగింది. వివరాల్లోకి వెళితే... ఖమ్మం రూరల్ మండలంకు చెందిన మైనర్ ప్రభుత్వ గురుకుల పాఠశాలలో విద్యనభ్యసిస్తుంది. వేసవి సెలవులు కావడంతో ఖమ్మం రాపర్తి నగర్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న తాతయ్య, అమ్మమ్మల వద్దకు వచ్చింది. వచ్చిన దగ్గర నుంచి ఏదో ఒక రకంగా మహ్మద్ గౌస్‌పాషా అనే వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. గౌస్‌పాషా అదే భవనంలో రెండవ అంతస్తులో నివసిస్తున్నాడు. ఈనెల ఆరున మైనర్‌ను భవనంపైకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అక్కడి నుంచి కిందకు నెట్టి వేయడంతో బాలిక తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకుంది. ఆమెను తొలుత ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మం మమత జనరల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. సోమవారం సాయంత్రం ఆమె స్పృహలోకి వచ్చి జరిగిన దారుణ ఘటనను కుటుంబ సభ్యులకు వివరించింది. అప్పటి వరకు ప్రమాదవశాత్తు భవనం పై నుంచి పడిందని భావించిన తల్లిదండ్రులు బాలిక అసలు విషయం తెలపడంతో ఖమ్మం టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు నిందితునిపై పోక్సో చట్టం క్రింద కేసు నమోదు చేసి నిందితున్ని అదుపులోకి తీసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఇదిలా ఉండగా ఈ కామాంధున్ని రక్షించేందుకు కొందరు మాజీ కార్పొరేటర్లు ప్రయత్నించడం నగర ప్రజలకు విస్మయం కలిగించింది.

**నిందితున్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ :**
నిందితున్ని కఠినంగా శిక్షించాలని బాధిత కుటుంబానికి సత్వర న్యాయం జరిగేలా చూడాలని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఈ దారుణ ఘటన పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. మమత ఆసుపత్రి ద్వారా మైనర్ పూర్తిగా కోలుకునే వరకు ఉచితంగా వైద్య సాయం అందిస్తామన్నారు. నిందితున్ని కఠినంగా శిక్షించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, ఎంపి వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు, ఎన్ఎఫ్ఐడబ్ల్యు నాయకులు పోటు కళావతి, బత్తినేని నీరజ, తాటి నిర్మల, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, మాస్‌లైన్ నాయకులు నిందితున్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రజక సంఘం ఆధ్వర్యంలో నిందితునిపై సత్వరం చర్యలు తీసుకుని బాధితురాలిని ఆదుకోవాలని కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.

# సహకార రంగానికి పూర్వవైభవం

(మొదటిపేజీ తరువాయి)
కొద్దిరోజుల్లోనే ఏకకాలంలో రూ.20వేలకోట్లు రుణమాఫీచేసిన ఏకైక ప్రభుత్వం మన ప్రభుత్వమని తెలిపారు.పనిచేసే ప్రభుత్వానికి ప్రజామద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని, అప్పుడే గ్రామీణ ప్రజల బతుకులు మారతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, రాష్ట్ర గిడ్డంకుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్., సీపీ సునీల్‌దత్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ వెన్నెపూసల సీతారాములు, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు కొడాలి గోవిందరావు, మాజీ మార్కెట్‌కమిటీ ఛైర్మన్ శాఖమూరి రమేష్, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజనీ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## 167ఇన్‌స్ట్రక్టర్, 79ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** పూర్వప్రాథమిక పాఠశాలలో పనిచేసేందుకు 167ఇన్‌స్ట్రక్టర్, 79ఆయా పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ పూర్తిచేసినట్లు మండల విద్యాశాఖాధికారి బి.చలపతిరావు పేర్కొన్నారు. ఈమేరకు మండల విద్యావనరుల కేంద్రంలో మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలోని 6పాఠశాలలకుగాను దరఖాస్తులు స్వీకరించారని, పరిశీలించిన అనంతరం నేడు త్రిసభ్య కమిటీగా తహశీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓలు అర్హుల జాబితాను జిల్లా అధికారులకు పంపనున్నట్లు తెలిపారు. రాయగూడెంలో ఉపాధ్యాయులకు 19, ఆయాలకు 12, చెరువుమాదారంలో ఉపాధ్యాయులకు28, ఆయాకు 11, పైనంపల్లి ఉపాధ్యాయులకు22, ఆయాకు10, సింగారెడ్డిపాలెంలో ఉపాధ్యాయులు64, ఆయాకు 27, బైరవునిపల్లిలో ఉపాధ్యాయులకు 15, ఆయాకు 5, నాచేపల్లిలో ఉపాధ్యాయులకు 19, ఆయాకు14 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు.

# అంపశయ్యపై ప్రభుత్వ విద్య..!

(మొదటిపేజీ తరువాయి)
పాఠశాలల్లో అత్యున్నత ఫలితాలు వస్తుండటం కూడా ప్రభుత్వ విద్యపై సానుకూలత లేకపోవడానికి కారణమైంది. 80 మంది విద్యార్థులు ఉన్న చోట ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు పని చేయడం, ముగ్గురు విద్యార్థులు ఉన్న చోట ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్నా క్రమబద్ధీకరణ చేయకపోవడం కూడా ప్రభుత్వ పాఠశాలలపై విమర్శలకు కారణమైంది. ప్రభుత్వ విద్య పురోగమనానికి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం మేము యంగ్ ఇండియా పాఠశాలలు పెడతాం, గురుకులాలు తెరుస్తాం, అల్పాహారం పెడతాం, మధ్యాహ్న భోజనం పెడతాం కానీ ప్రభుత్వ పాఠశాలలు ఎత్తేస్తామనే వాదన వినిపిస్తుండటం ఆశ్చర్యంగా కనిపిస్తుంది.

**బాధ్యత మరిచిన ఉపాధ్యాయులు...**
ప్రభుత్వ విద్య తిరోగమనానికి ప్రభుత్వం ఎంత బాధ్యత వహించాలో ఆ విషయంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు అంతే బాధ్యత వహించాలి. బెల్లు, బిల్లు, టీచర్ల సంఖ్య పెరగడం, బోధన వృత్తిపట్ల నిబద్ధత లేకపోవడం, పాఠశాల సమయాల్లో సైతం వ్యక్తిగత వ్యవహారాలు, వ్యాపారాలకు ప్రాధాన్యతనివ్వడం ప్రభుత్వ పాఠశాలలు పరపతి కోల్పోయేందుకు కారణమయ్యాయి. ప్రభుత్వ పాఠశాలలకు వెళితే తమ పిల్లలు వృద్ధిలోకి రారన్న భావన తల్లిదండ్రుల్లో బలంగా నాటుకుంది. తిరిగి విశ్వాసాన్ని తల్లిదండ్రుల్లో పెంపొందించేందుకు ప్రభుత్వ పరంగా కానీ, ఉపాధ్యాయుల పరంగా కానీ కనీస కృషి జరగలేదన్నది వాస్తవం. జయశంకర్ బడి బాట పెడితే 90 శాతం ఉపాధ్యాయులు మొక్కుబడిగా నిర్వహించి ఓ ఫోటోకు పరిమితం అయ్యారు తప్ప అసలు గ్రామంలో బడిఈడు పిల్లలు ఎందరు, గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉంటే ప్రైవేటు పాఠశాలకు పెద్ద మొత్తంలో ఫీజులు కట్టి ఎందుకు పంపుతున్నారు అన్న దానిపై కనీస కసరత్తు జరగలేదు. ప్రైవేటు పాఠశాలల కంటే మేము మెరుగైన విద్యా బోధన చేస్తామని తల్లిదండ్రులకు భరోసా కల్పించలేకపోయారు. ఉపాధ్యాయుల నిర్లక్ష్య వైఖరి, ఉపాధ్యాయ సంఘాల మెతక వైఖరి కూడా కారణం. ప్రభుత్వం చెబుతున్నట్లుగా వేల సంఖ్యలో ఉన్న పాఠశాలలు కుదింపు జరిగితే భవిష్యత్తులో ప్రభుత్వ ఉపాధ్యాయ రిక్రూట్‌మెంట్లు ఉండవు. ఈ సమాజంలో అత్యంత గౌరవం పొందిన ప్రభుత్వ ఉపాధ్యాయ వ్యవస్థ కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. భవిష్యత్తులో ఇక రిటైర్‌మెంట్లు తప్ప రిక్రూట్‌మెంట్లు లేని పరిస్థితి దాపురిస్తుంది. ప్రభుత్వ పాఠశాలలన్ని కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ బోధనా సిబ్బందితో నిండిపోతాయి. ప్రభుత్వానికి కూడా ఆర్థిక పరమైన వెసులుబాటు లభిస్తుంది . ఎందుకంటే ఓ సీనియర్ ఉపాధ్యాయునికి చెల్లించే వేతనంతో మూడు నుంచి నాలుగు మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను నియమించవచ్చునన్న ఆలోచనతోనే ప్రభుత్వం బదులు విషయంలో పొమ్మనలేక పొగపెడుతుంది. దీనిపై విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు గొంతెత్తాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

**తల్లిదండ్రులు ఆలోచించాలి...**
తల్లిదండ్రులు సైతం ప్రభుత్వ విద్య విషయంలో ఆలోచన చేయాలి. అనుభవం, అత్యున్నత శిక్షణ కలిగిన ఉపాధ్యాయుల బోధనతో సాగే ప్రభుత్వ పాఠశాలల పట్ల సానుకూల వైఖరి ప్రదర్శించాలి. ప్రైవేటుపై మోజుతో లక్షల రూపాయలు ఖర్చు పెట్టి ఆర్థిక ఇబ్బందులు పడే బదులు ఆయా గ్రామాల్లో ఉత్తమ బోధన జరిగేలా పాఠశాలలను తీర్చి దిద్దుకోవాలి. ప్రభుత్వ విద్యపై కోపంతో ప్రైవేటు విద్యా సంస్థల్లో చేర్పించడం ప్రభుత్వ విద్యను బలహీనపర్చడమే అవుతుంది. ఇదే జరిగితే భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలలు లేక ప్రైవేటు ఫీజులు చెల్లించలేక స్థానికంగా పలువురు విద్యకు దూరమయ్యే పరిస్థితి ఉంటుంది. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ విద్యను బతికించుకునేందుకు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా స్పందించాల్సి ఉంది.

## సిపిఐ నాయకుడు పాపయ్యకు ఘన నివాళి

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం:** మండల పరిధిలోని కొక్కిరేణి గ్రామానికి చెందిన సీపీఐ నాయకులు, మాజీ సర్పంచి ఉడుగు పాపయ్య అనారోగ్యంతో మృతిచెందిన నేపథ్యంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేశ్ పాపయ్య భౌతికకాయానిపై పార్టీ జెండాను కప్పి ఘనంగా నివాళులర్పించారు. ఈ మేరకు వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వారి మృతి పార్టీకి తీరని లోటని, పార్టీ అభ్యున్నతికి ఎంతో కృషిచేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి బత్తుల రాధాకృష్ణ, సీనియర్ నాయకులు చావా వెంకట్రావు, మండల కార్యదర్శి చీమ రామకృష్ణ, సర్పంచి కర్నాటి రాజేంద్రప్రసాద్, గుగ్గిల అంబేద్కర్, సిరిగిద్ద ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



## మెయిన్ డ్రైనేజీ కాల్వ పరిశీలన

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని వాణి వివేకానంద స్కూల్ వెనుక ఉన్న వైరా పట్టణంలోని డ్రైనేజీ నీరు వెళ్లే కాల్వను శుభ్రపరిచే విధంగా చర్యలు చేపట్టే దానిలో భాగంగా మంగళవారం వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ హెల్త్ అండ్ మెడికల్ అధ్యక్షులు కాపా మురళీకృష్ణ, ఎస్సై పుప్పాల రామారావు, మున్సిపల్ ఏఈ శ్రీమన్య కాల్వను పరిశీలించారు. ఈ సందర్భంగా కాల్వలో ఉన్న వ్యర్థాలను తొలగించడంతో పాటు ఎక్కడ డ్రైనేజీ నీరు ఆగకుండా పోయే విధంగా పనులు చేసే విధంగా చేపట్టాలని అన్నారు. అనంతరం వైరా ఇందిరమ్మ కాలనీ వద్ద జరుగుతున్న షీల్డ్ కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాదినేని దుర్గాప్రసాద్, కొల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## గంజాయి రహిత సమాజంగా మార్చుకొందాం

- కార్పొరేటర్ వీసంశెట్టి విశ్వేశ్వర్‌రావు

**ప్రజాపక్షం/పాల్వంచ :** నేడు గంజాయి మహమ్మారి సమాజాన్ని పట్టి పీడిస్తున్నదని దానికి అలవాటు పడిన వారు ఉన్మాదుల్లా తయారై పలు నేరాలకు పాల్పడుతున్నారని దీనిని నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరు తమ బాధ్యతగా తీసుకోవాలని 44వ, డివిజన్ కార్పోరేటర్ వీసంశెట్టి విశ్వేశ్వరరావు అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ 44వ, డివిజన్ పాల్వంచ పరిధి గాంధీనగర్‌లో ప్రత్యేక వార్డు సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరావు మాట్లాడుతూ సంక్షేమ పథకాల కోసం ఎవరూ దళారీలను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ మునిసిపల్ డివిజన్ కార్యాలయ మేనేజర్ ఎల్‌వి. సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్ హరిబాబు, వార్డు ఆఫీసర్, మల్లేష్, జిపిఒ శ్రీనివాస్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, మెప్మా ఆర్‌పి, పలుశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

**ప్రజాపక్షం/ బోనకల్ :** రోడ్డు ప్రమాదంలో బోనకల్ మండలం పెద్దబీరవల్లి గ్రామానికి చెందిన మహిళ మృతిచెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. కృష్ణాజిల్లా వత్సవాయి మండలం మక్కపేటలో జరిగిన ప్రమాదంలో పెద్దబీరవల్లికి చెందిన గౌరెమ్ముచ్చు ప్రమీల అక్కడిక క్కడే మృతిచెందింది. ద్విచక్ర వాహనం పై వెళ్తున్న వారు లారీని దాటే క్రమంలో మోటార్ సైకిల్ అదుపు తప్పడంతో వెనక కూర్చున్న ప్రమీల లారీ చక్రాల క్రింద పడింది. వత్సవాయి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గాంధీ విగ్రహం ప్రాంగణంలో పనుల ప్రారంభం

### సుందర వనంగా గాంధీ పార్క్ ఏర్పాటు

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో ఉన్న గాంధీచౌక్‌లోని గాంధీ విగ్రహం ప్రాంగణం రేపురేఖలు మారిపోతున్నాయి. వైరా ఎస్సై పుప్పాల రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, మున్సిపల్ కౌన్సిలర్ మాదినేని సునీత గాంధీ విగ్రహం ప్రాంగణానికి సంబంధించి మంగళవారం మట్టితో ప్రాంగణం మొత్తం నింపివేశారు. వైరా ఎస్సై పుప్పాల రామారావు ప్రత్యేక శ్రద్ధతో గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళతో కలిసి ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహం పూర్తిస్థాయిలో ఒక మోడల్ గార్డెన్‌గా తయారు చేసి గేట్లు పెట్టి ఆహ్లాదకరమైన వాతావరణం అందించడమే ధ్యేయంగా చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మాదినేని సునీత విజ్ఞప్తి మేరకు వైరాలో సుందర వనంగా పర్యాటకులను ఆకర్షించే విధంగా గాంధీ విగ్రహం ప్రాంగణం ముస్తాబు చేయడం జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రామచంద్రరావు, కాంగ్రెస్ హెల్త్ అండ్ మెడికల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, మాదినేని దుర్గాప్రసాద్, మిట్టపల్లి కిరణ్, కొల్లా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



## అత్తగారింటి ముందు కోడలు బైఠాయింపు

**ప్రజాపక్షం/పాల్వంచ :** కాపురానికి తీసుకెళ్ళటం లేదని ఓ కోడలు అత్తగారింటి ముందు బైఠాయించి ధర్నాకు దిగిన సంఘటన సోమవారం పాల్వంచ పట్టణంలో జరిగింది. వివరాల్లోకి వెళితే పాల్వంచలోని ఎస్‌సి గురుకుల కళాశాలలో చదువుకొంటున్న చంద్రుగొండ మండలానికి చెందిన సిద్దెల వెంకటేశ్వర్లు కూతురు దివ్యను పాల్వంచ పట్టణం 44వ, డివిజన్ గాంధీనగర్‌కు చెందిన నంద్రు విహారితో నాలుగు సంవత్సరాల క్రితం వివాహం జరిపించారు. అదనపు కట్నం కావాలంటూ విహారి తన భార్య దివ్యను కాపురానికి తీసుకెళ్ళటం లేదని ఆరోపిస్తూ దివ్య బంధువులతో కలిసి మంగళవారం తన అత్తగారింటి ముందు బైఠాయించి ధర్నాకు దిగింది. సిపిఎం నాయకులు సంఘీభావం ప్రకటించి దివ్యకు అండగా నిలిచారు. సమాచారం అందుకొన్న పోలీసులు బాధితురాలికి నచ్చజెప్పి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్ళారు.

# పెన్షనర్ల సమస్యలను పరిష్కరించండి




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు సమస్యలతో సతమతమవుతున్నారని, వెంటనే సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్‌జిపిఏటి) రాష్ట్ర కార్యదర్శి వి. మేరీ ఏసు పాదం, జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కృషి భవన్‌లో ఎస్‌జిపిఏటి జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య అధ్యక్షతన జరిగిన పెన్షనర్ల సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఏసుపాదం మాట్లాడుతూ వైద్యశాలల ఎంపిక జరగకుండా, ఈహెచ్ ఎస్ విధి విధానాలు లేకుండా పెన్షనర్లకు సమాచారం లేకుండా ప్రీమియం మినహాయింపులు చేయడం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే స్పందించి పెన్షనర్ల మానసిక ఆందోళనకు పరిష్కారం చూపాలని ఆయన డిమాండ్ చేశారు. రెండేళ్లుగాఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్ల బకాయిలను సత్వరమే చెల్లించాలని, జిపిఎఫ్ బకాయిలు పలువురు పెన్షనర్లకు జమ కాలేదన్నారు జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య మాట్లాడుతూ సత్వరమే జిపిఎఫ్ బకాయిలను చెల్లించాలని కోరారు. ఐదు విడతల కరువు భత్యం (డిఏ) బకాయిలను ఏక మొత్తంగా చెల్లించాలని, పిఆర్‌సిని సత్వరమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు కేంద్ర ప్రభుత్వం దఫా దఫాలుగా పెంచుతుందని దీని ఫలితంగా పెన్షనర్లు, మధ్యతరగతి ప్రజానీకం, కార్మికులు, కర్షకులు సతమతమవుతున్నార న్నారు. సమావేశానికి ముందు పెన్షనర్లు ప్రముఖ అధ్యాపకులు బివి రామారావు, కొసరాజు రామకృష్ణయ్య, కాలం వీరభద్రరావు, చావా శ్రీహరి మృతితో పాటు విశాఖపట్నం ఉక్కు ఫ్యాక్టరీ ప్రమాద మృతులకు దేశ వ్యాప్తంగా వడగాల్పుల మృతులకు, ఢిల్లీ అగ్నిప్రమాదం, పడవ ప్రమాదంలో మరణించిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, జిల్లా ఆర్థిక కార్యదర్శి గుర్రాల శ్రీనివాసరావు, సంయుక్త అధ్యక్షులు కనపర్తి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు పెదమాళ్ల సత్యనారాయణ, మహిళా కార్యదర్శి బోజడ్ల కృష్ణకుమారి, కార్యదర్శులు ప్రసాదరావు, నాగప్రసాద్, సుధాకర్, రామనాథం, హుస్సేన్, కార్యకర్తలు శివకుమార్, దేవప్రసాద్, ఆదినారాయణ, నాగేశ్వరరావు , సీనియర్ పెన్షనర్లు దుగ్గినేని శ్రీనివాసరావు, చీదిరాల వెంకటేశ్వర్లు, వీర భద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన విద్యుత్ సేవలు అందించడమే సంస్థ లక్ష్యం



**-కిలోమీటర్ లోపు ఉచితంగా విద్యుత్‌లైన్ ఏర్పాట్లు**
**-విద్యుత్‌శాఖ ఏడీ. పి.వెంకట్**

ప్రజాపక్షం/నేలకొండపల్లి: మెరుగైన విద్యుత్ సేవలు అందించడమే సంస్థ లక్ష్యమని విద్యుత్‌శాఖ కూసుమంచి ఏ.డీ. పి.వెంకట్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి విలేకరులతో మాట్లాడారు. ఒక కిలోమీటర్ దూరంలో నూతనంగా విద్యుత్‌లైన్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఉచితంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని గృహ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డివిజన్‌వ్యాప్తంగా 29,307మంది లబ్ధిదారులు గృహజ్యోతి పథకం వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు. గత నెలలో గృహజ్యోతి పథకం కింద 200యూనిట్లను వినియోగించుకున్నందుకు రూ.1,16కోట్లు ప్రభుత్వం చెల్లించినట్లు తెలిపారు. ఇటీవల ఈదురుగాలులు, వర్షాలకు డివిజన్‌వ్యాప్తంగా పెద్దెత్తున స్తంభాలు విరిగినట్లు తెలిపారు. సిబ్బంది రేయింబవల్లు కష్టపడి పునుద్ధరణ సకాలంలో చేశారని అన్నారు. ప్రజాదర్బార్ డివిజన్‌వ్యాప్తంగా 1,112దరఖాస్తులు విద్యుత్ సమస్యలపై అందాయని సకాలంలో వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని, బకాయిలను వసూళ్ల చేసేందుకు ప్రత్యేకడ్రైవ్ చేపట్టనున్నట్లు తెలిపారు. విద్యుత్‌చౌర్యాన్ని సహించమని, చౌర్యం జరిగితే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి ఏ.ఈ.జీ.రవి, సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ చెన్నకేశవస్వామి దేవస్థాన చైర్మన్‌గా యండపల్లి



ప్రజాపక్షం/చింతకాని : చింతకాని మండల కేంద్రంలో గల శ్రీచెన్నకేశవ స్వామి దేవాలయ నూతన పాలక మండలిని ఏర్పాటు చేస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్ గా యండపల్లి శ్రీనివాస రావు, కమిటీ సభ్యులు గా కొమ్మిన్ని రామారావు, పెద్దగౌండ్ల వెంకటనారాయణ, కొడవకంటి రాంబాబు, తూము భిక్షం, పగిడిపల్లి నవత, బండి తిరపయ్య లను నియమించింది. ఈ సందర్భంగా చైర్మన్ యండపల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో మరో సారి చైర్మన్‌గా నియమించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. చైర్మన్‌గా ఆలయ అభివృద్ధి కోసం కృషిచేస్తూ భక్తులకు సేవలందిస్తానన్నారు.

# సింగరేణి సంస్థను కాపాడుకుందాం

**-కార్యదర్శి సముద్రాల సుధాకర్**
**-ఏఐటీయూసీ కేంద్ర కౌన్సిల్ సమావేశాలు విజయవంతం**




ప్రజాపక్షం/సత్తుపల్లి: సింగరేణి సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్మికుడిపైనా ఉందన్నారు ఏఐటియూసి సత్తుపల్లి కార్యదర్శి సముద్రాల సుధాకర్. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రుద్రంపూర్ ఆర్‌సీఓఏ క్లబ్‌లో రెండు రోజులపాటు జరిగిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) కేంద్ర కౌన్సిల్ సమావేశాలు విజయవంతంగా ముగిశాయి. సింగరేణి వ్యాప్తంగా ఉన్న నాయకులు, కార్యకర్తల్లో పోరాట స్ఫూర్తిని నింపిన ఈ సమావేశాల్లో కార్మికుల సమస్యలు, సంస్థ భవిష్యత్, ఉద్యోగ భద్రత, కార్మిక సంక్షేమం, పెండింగ్ డిమాండ్లపై విస్తృతంగా చర్చించారు. సమావేశాల అనంతరం యాజమాన్యం అవలంబిస్తున్న మొండివైఖరికి నిరసనగా సుమారు 30 డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసును ఏఐటీయూసీ అగ్ర నాయకత్వం జనరల్ మేనేజర్ (పర్సనల్)కు అందజేసింది. ఈ సందర్భంగా సత్తుపల్లి ప్రాంత కార్యదర్శి సముద్రాల సుధాకర్ మాట్లాడుతూ సింగరేణి సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్మికుడిపైనా ఉందన్నారు. కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, సంక్షేమ అంశాల విషయంలో ప్రభుత్వం, యాజమాన్యం అవలంబిస్తున్న నిర్లక్ష్య ధోరణిపై కేంద్ర కౌన్సిల్ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ నిరంతరం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నప్పటికీ, యాజమాన్యం సమస్యలను పరిష్కరించడంలో జాప్యం చేయడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. పదోన్నతులు, వారసత్వ ఉద్యోగాలు, వైద్య సదుపాయాల మెరుగుదల, ఖాళీ పోస్టుల భర్తీతో పాటు కార్మిక సంక్షేమానికి సంబంధించిన పలు పెండింగ్ అంశాలపై వెంటనే నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కేంద్ర కౌన్సిల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు సింగరేణి కార్మిక ఉద్యమానికి కొత్త దిశానిర్దేశం చేస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వం, యాజమాన్యం కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ముందుకు రాకపోతే నిరవధిక సమ్మెతో పాటు రాజీలేని పోరాటాలు చేపట్టక తప్పదని హెచ్చరించారు. రానున్న రోజుల్లో యూనియన్ ఇచ్చే పోరాట పిలుపులకు సత్తుపల్లి ప్రాంత నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పెద్దఎత్తున స్పందించి ప్రతి ఉద్యమంలో భాగస్వాములు కావాలని, తద్వారా సింగరేణి సంస్థను పరిరక్షించుకోవాలని సముద్రాల సుధాకర్ పిలుపునిచ్చారు.

# నిత్యావసరాల ధరలు తగ్గించాలి



ప్రజాపక్షం/సత్తుపల్లి: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలతో పాటు నిత్యవసరాల ధరలు తగ్గించాలని సిపిఐ ఆధ్వర్యంలో జూన్ 10న , బుధవారం ఉదయం 10 గంటలకు ఖమ్మం కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఐ ఖమ్మం జిల్లా కౌన్సిల్ సభ్యురాలు ఎస్కే.రంజాన్ బి కోరారు. సోమవారం వేంసూరులోని ఏకలవ్య నగర్ లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వంట గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరల పెరుగుదలతో నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని సామాన్యుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ధరలు తగ్గించే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. అసలే పేదలు బతకటం కష్టంగా ఉంటే ధరల మీద, ధరల పెంచుతూ మోడీ ప్రభుత్వం పేదలపై భారాలు మోపుటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పెరిగిన ధరలకు నిరసనగా నేడు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో వేంసూరు శాఖ కార్యదర్శి ఎస్కె.లాల్ మహమ్మద్, వెంకటమ్మ, ఇట్టా వెంకటేశ్వరావు,సీతమ్మ, మరియమ్మ, జమలమ్మ, అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మాట ఇచ్చాం..చేసి చూపెడుతున్నాం...

### ఇరవై ఏళ్లనాటి సమస్యకు పరిష్కారం



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ 6,9 వార్డుల్లో గత 20 సంవత్సరాలు నుండి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యకు మున్సిపల్ చైర్మన్ కాపా చంద్రకళ మురళీకృష్ణ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్ శాశ్వత పరిష్కారం దిశగా ముందుకు అడుగులు వేశారు. ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ సూచనల మేరకు ఇందిరమ్మ కాలనీకి వరదల ముప్పు లేకుండా చూసేందుకు ముందస్తు చర్యలు భాగంగా వెనుక భాగంలో సిల్ట్ తీసి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సతోష్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ హెల్త్ అండ్ మెడికల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణతో కలిసి పనులను ప్రారంభించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా ఈ ప్రాంత ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటూ వరదలు వచ్చిన సమయంలో శిబిరాలకు తరించడం జరిగేది. అలాంటి సమస్య లేకుండా ఉండేందుకే ఈ ప్రయత్నం మొదలుపెట్టామని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ కరకట్ట నిర్మాణానికి రూ.6కోట్లను ప్రతిపాదన పంపడం జరిగింది. త్వరలోనే దానికి అనుమతులు రానున్నాయి. ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక తీరుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఇందిరమ్మ కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మైనర్‌పై జరిగిన దారుణ ఘటన కలచివేసింది

### ఘనటకు పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి
### మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి



ప్రజాపక్షం/వైరా: ఖమ్మం నగరంలో మైనర్ బాలికపై జరిగిన దారుణ ఘటన తీవ్రంగా కలిచివేసింది అని మాజీ శాసనసభ్యురాలు బానోతు చంద్రావతి అన్నారు. ఈ సందర్భంగా ఆమె ఒక ప్రకటనలో తెలుపుతూ ఒక వ్యక్తి అసభ్య ప్రవర్తనకు పాల్పడి అనంతరం ఆమెను భవనం నుండి తోసి వేయడం వంటి అమానవీయ చర్యకు పాల్పడినట్లు తెలిసింది. ఈ ఘటన సమాజాన్ని తీవ్రంగా కలచివేసే విషయం బాధితురాలి పట్ల జరిగిన ఈ దారుణ చర్యను నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. మైనర్ బాలికల భద్రత విషయంలో ఎలాంటి రాజీకి చోటు లేదు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవడం చాలా అవసరం. ఈ కేసులో పోక్సో చట్టం క్రింద నిందితుడిపై కేసు నమోదు మాత్రమే కాకుండా సముచితమైన చర్యలు తీసుకోవాలి. దోషికి చట్ట ప్రకరం అత్యంత కఠిన శిక్ష పడేలా వేగవంతమైన నిష్పక్షపాత విచారణ జరగాలని నేను కోరుతున్నాను. బాధితురాలికి తక్షణ వైద్య సహాయం, మానసిక మద్దతు, పూర్తి న్యాయం అందించాలి. ఆమె కుటుంబానికి ప్రభుత్వం, సంబంధిత అధికారులు అన్ని విధాలుగా అండగా నిలవాలని మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి తెలిపారు.

# 13వ వార్డులో కల్వర్టుకు శంకుస్థాపన



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ 13వ వార్డులో కౌన్సిలర్ ముళ్ళపాటి విజయ సీతారాములు గత కొంతకాలంగా కల్వర్టు పాడై డ్రైనేజీ వాటర్ పోవడానికి ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకొని అధికారులతో మాట్లాడి 13వ వార్డులో మణిగె రాములు ఇంటి దగ్గర కల్వర్టు పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, మున్సిపల్ కమీషనర్ రామచంద్రరావు, ముళ్ళపాటి విజయతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, షేక్ బాబుజాని, బాడిషా రవి, రాయి హుస్సేన్, ఈలప్రోలు ప్రశాంత్, షేక్ బాబా, షేక్ అజీజ్, రాసకొండ సాయి, తోట రమేష్, అఖిశెట్టి పూరి, రామిశెట్టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లలో వ్యవసాయ కార్మికులకు ప్రాధాన్యత కల్పించాలి




ప్రజాపక్షం/దమ్మపేట : ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో వ్యవసాయ కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలని, సాగులో ఉన్న పోడు భూములకు వెంటనే హక్కు పత్రాలు అందజేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ముదిగొండ రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళ వారం దమ్మపేటలో సంఘం సీనియర్ నాయకుడు బ్రహ్మయ్య అధ్యక్షతన జరిగిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వృద్ధాప్య, వితంతు, వికలాంగులకు కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని, ఉపాధి హామీ కార్మికులకు రోజుకు రూ 600 కూలీతో 200 రోజుల పని కల్పించాలని కోరారు. పెరిగిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం నూతన మండల కమిటీని ఎన్నుకోగా, మండల అధ్యక్షుడిగా పిల్లి నాయుడు, మండల ప్రధాన కార్యదర్శిగా కొల్లిపోగు శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మోరంపూడి శ్రీనివాసరావు, రమేష్, వెంకటనారాయణ, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ల జోరు



ప్రజాపక్షం/కారేపల్లి : కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ జోరుగా కొనసాగుతోంది. కళాశాల ప్రిన్సిపల్ నోముల విజయకుమారి ఆధ్వర్యంలో అధ్యాపక బృందం మండలంలోని పలు గ్రామాలు, పాఠశాలలను సందర్శిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులను కలిసి అడ్మిషన్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. క్యాంపెయినింగ్‌లో భాగంగా పూర్వ విద్యార్థులను భాగస్వామ్యం చేసి, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీడీవోలను కలిసి కళాశాల కరపత్రాలను అందజేశారు. విద్యార్థులకు డిజిటల్ టీవీలు, ప్రొజెక్టర్లు, ఆధునిక బోధనా పరికరాలు, ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత వసతులు, నాణ్యమైన విద్యా అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ నోముల విజయకుమారి మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్య అందించడమే కళాశాల ప్రధాన లక్ష్యమన్నారు. గత రెండేళ్లుగా అధ్యాపకుల కృషి ఫలితంగా ఈఏపీసెట్‌తో పాటు పలు పోటీ పరీక్షల్లో విద్యార్థులు విజయాలు సాధించారని తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో అందుబాటులో ఉన్న ఉచిత విద్య, మెరుగైన సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని కోరారు.ఈకార్యక్రమంలోకళాశాలఅధ్యాపకులు పాల్గొన్నారు.

## ఖమ్మం ఘటనపై నిందితుడికి కఠిన శిక్ష విధించాలి

**-బాధిత బాలికకు పూర్తి న్యాయం చేయాలి**
**-బీఆర్ఎస్ నాయకుడు లకావత్ లక్ష్మణ్**



ప్రజాపక్షం/కారేపల్లి: ఖమ్మం నగరంలో మైనర్ బాలికపై జరిగిన దారుణ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండల నాయకుడు, మాజీ దిశా కమిటీ సభ్యుడు లకావత్ లక్ష్మణ్ అన్నారు. మంగళవారం కారేపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఒక వ్యక్తి మైనర్ బాలికపై అసభ్య ప్రవర్తనకు పాల్పడి అనంతరం భవనం పై నుంచి తోసివేయడం వంటి అమానవీయ చర్యకు పాల్పడినట్లు తెలిసిందని, ఈ ఘటన సమాజాన్ని తీవ్రంగా కలిచివేసిందని పేర్కొన్నారు. బాలికల భద్రత విషయంలో ఎలాంటి రాజీకి తావు ఉండకూడదని, బాధితురాలిపై జరిగిన దారుణాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ కేసులో పోక్సో చట్టం కింద కేసు నమోదు కావడం సరైన చర్యేనని, నిందితుడికి చట్ట ప్రకారం అత్యంత కఠిన శిక్ష పడేలా వేగవంతమైన, నిష్పక్షపాత విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బాధిత బాలికకు అత్యవసర వైద్య చికిత్స, మానసిక పరమైన సహాయం అందించడంతో పాటు పూర్తి న్యాయం చేయాలని కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం, సంబంధిత అధికారులు అన్ని విధాలా అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలను కఠినంగా అమలు చేయడంతో పాటు సమాజంలో అవగాహన పెంపొందించాలని అన్నారు.

## 12న స్వామికి పంచామృతాభిషేకం



ప్రజాపక్షం/పాల్వంచ : మండల పరిధి కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్యన వేంచేసియున్న ( శ్రీకనకదుర్గ ) పెద్దమ్మతల్లి దేవాలయ ఆవరణంలో నూతనంగా నిర్మించిన శ్రీ అన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో మాఘమాస త్రయోదశి సందర్భంగా ఈ నెల 12వ, తేదీన నందీశ్వరస్వామివారికి పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామార్చన, అనంతరం నీరాజన మంత్రపుష్పం, మాసశివరాత్రి సందర్భంగా 13వ, తేదీన పెద్దమ్మతల్లి ఆలయ యాగశాలలో రుద్రహోమం నిర్వహిస్తున్నామని ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎన్. రజనీకుమారి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలన్నారు.

# ప్రభుత్వ భూములకు విముక్తి

**-సత్తుపల్లిలో కొత్త పరిపాలనా సంస్కృతికి నాంది**
**-అంగ, ఆర్థిక బలంతో బరితెగించిన బడాబాబులు, భూ స్వాములు**
**-గ్రామకంతం,చెరువు ముంపు,శిఖం భూములను అనుభవిస్తున్న అక్రమార్కులు**
**-ఆక్రమణలపై కొరడా ఝుళిపిస్తున్న**
**-ఎమ్మెల్యే దంపతులకు జేజేలు పలుకుతున్న ప్రజలు**








ప్రజాపక్షం/సత్తుపల్లి: సత్తుపల్లి ప్రాంతంలో దశాబ్దాలుగా ప్రభుత్వ భూములపై కొనసాగుతున్న ఆక్రమణలపై ఇప్పుడు అధికార యంత్రాంగం దృష్టి సారించడం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా గ్రామ కంఠం భూములు, చెరువు శిఖం భూములు, ముంపు ప్రాంతాలు, ఇతర ప్రభుత్వ భూములు కొందరు బడాబాబులు, భూస్వాములు ఆర్థిక బలంతో తమ అధీనంలోకి తీసుకుని అనుభవిస్తున్నారనే ఆరోపణలు చాలా కాలంగా వినిపిస్తున్నప్పటికీ, వాటిపై కఠిన చర్యలు తీసుకునే పరిస్థితి కనిపించలేదు. అయితే ప్రస్తుతం సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ విజయ్ కుమార్ దంపతులు ప్రభుత్వ భూముల పరిరక్షణను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో పరిస్థితులు మారుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా ఎవరి దృష్టికీ అందకుండా ఉన్న ఆక్రమణలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తుండటం విశేషం. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై కొరడా ఝుళిపిస్తున్న ఎమ్మెల్యే దంపతులపై సత్తుపల్లి ప్రజానీకం జేజేలు పలుకుతుంది. ప్రభుత్వ భూములు కొందరి వ్యక్తిగత ఆస్తులుగా మారాయిసత్తుపల్లి పట్టణంలోని పదుల ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమించిన బడాబాబులు తమ స్వంత ఆస్థులుగా చూపిస్తూ చలామణి అవుతున్నారు. పేదలకు ఇంటి స్థలం కోసం గజం భూమి దొరకని పరిస్థితుల్లో, కొందరు భూస్వాములు వందల ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించి, ఫెన్సింగ్‌లు వేసి, తమ సొంత ఆస్తుల్లా అనుభవించడం విస్మయాన్ని కలిగిస్తుంది. స్థానికంగా ఉన్న పలుకుబడి, రాజకీయ అనుబంధాలు, ఆర్థిక బలం ఆధారంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని కూడా ఆ ప్రాంతాలకు రానీయకుండా బడాబాబులు ప్రభావితం చేశారనే విమర్శలు ఉన్నాయి. మరి కొందరు అక్రమ మార్గాల్లో పట్టా పాసుపుస్తకాలు పొందారని, ఆ భూముల్లో కొంత భాగాన్ని విక్రయించినట్లు కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. హనుమాన్‌నగర్ చర్యలు కీలక మలుపుహనుమాన్‌నగర్ ప్రాంతంలోని ప్రభుత్వ భూములను అధికారులు స్వాధీనం చేసుకోవడం కేవలం ఒక భూ వివాద పరిష్కారం మాత్రమే కాదు. ఇది ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో అధికారుల చిత్తశుద్ధికి, ప్రజాప్రతినిధుల సంకల్పానికి నిదర్శనంగా భావించవచ్చు. అయితే స్థానిక ప్రజలు మరో ముఖ్యమైన అంశాన్ని ప్రస్తావిస్తున్నారు. ప్రభుత్వ భూమికి ఆనుకుని ఉన్న రెండు ఎకరాల 18 గుంటల గ్రామకంఠం భూమి కూడా ఆక్రమణలో ఉందని, అందులో కొబ్బరి తోటలు, గెస్ట్ హౌస్‌లు నిర్మించి ఫెన్సింగ్‌లు ఏర్పాటు చేశారని చెబుతున్నారు. ఈ భూమిపై కూడా సమగ్ర విచారణ జరిపి చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడం వల్ల కేవలం ప్రభుత్వ ఆస్తి రక్షణ మాత్రమే కాకుండా, భవిష్యత్తులో పేదలకు ఇళ్ల స్థలాలు, సామాజిక అవసరాలకు భూములు, ప్రజా మౌలిక వసతుల అభివృద్ధికి అవకాశాలు పెరుగుతాయని ప్రజాస్వామ్య వాదులంటున్నారు. ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసంగతంలో పాలకులు ఆక్రమణదారులకు అండగా నిలిచారనే విమర్శలు వినిపించిన నేపథ్యంలో, ప్రస్తుతం జరుగుతున్న చర్యలు ప్రజల్లో కొత్త నమ్మకాన్ని కలిగిస్తున్నాయి. ముఖ్యంగా భూమిలేని పేదలు, బడుగు బలహీన వర్గాలు ప్రభుత్వ భూముల పరిరక్షణను స్వాగతిస్తున్నాయి. తాము వేసిన ఓటుకు విలువ దక్కిందనే భావన ప్రజల్లో వ్యక్తమవుతోంది. అధికారంలో ఉన్నవారు ప్రభావశీలులకైనా, సాధారణ వ్యక్తులకైనా ఒకే విధంగా చట్టాన్ని అమలు చేస్తేనే నిజమైన ప్రజాస్వామ్యం బలపడుతుందని ప్రజలు భావిస్తున్నారు. ఎమ్మెల్యే రాగమయి దయానంద్ దంపతులను సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలు కీర్తించటంతో పాటు, ఇటువంటి ఎమ్మెల్యేను ఎన్నుకున్నందుకు తాము గర్వపడుతున్నామని ప్రజలు ప్రశంసిస్తున్నారు.

# మహాదేవ్ మొబైల్స్ మాయాజాలం..!

**-ఒరిజినల్ పేరుతో నకిలీ అమ్మకాలు**
**-మేము ఎలాంటి బిల్స్ ఇవ్వము**
**-ఎమ్మార్పీ రేట్లు లేకుండా విక్రయాలు**
**-అధికారులు తనిఖీలు ఎక్కడ?**









ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీలో మార్వాడి మాయాజాలంతో ప్రజలను మోసం చేస్తున్నాడు. స్థానిక ఎస్‌బిఐ బ్యాంక్ సమీపంలో ఉన్న మహాదేవ్ మొబైల్ షాపులో అంతా మాయాజాలం. ఒరిజనల్ క్వాలిటీ అంటూ నకిలీ సరుకు ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్నాడు. అమ్మే వస్తువులపై ఎంఆర్‌పి రేట్లు కూడా కనిపించవు. ఎవరైనా రేటు లేదు ఏమిటి అంటే అంతే అది అంటూ మాయ చెప్పి మసిబూసి మారేడు కాయ చేస్తారు. ఇది వాళ్ళ వక్రబుద్ధిని చూపిస్తున్నారు. మొబైల్ షాప్‌లో ప్రతి వస్తువు కూడా ఒరిజినల్ కంపెనీల పేరుతోనే అమ్మకాలు కొనసాగిస్తున్నారు. మొత్తం సెకండ్ క్వాలిటీ వస్తువులే అమ్ముతున్నారని పలువురు సెల్‌షాప్ నిర్వాహకులు కూడా ఆరోపిస్తున్నారు. వారు చెప్పిందే వేదం అనే విధంగా రేట్ల విషయంలో కూడా మాయ చేస్తూ దోచుకుంటున్నారు. ప్రతి వస్తువును మాయ మాటలు పేరుతో చూపిస్తూ క్వాలిటీ బ్రాండ్ అంటూ వచ్చిన కస్టమర్‌ను అందులో ఉన్న ముగ్గురు నలుగురు వ్యక్తులు కన్ఫ్యూజ్ చేసే చివరికి అమ్మకాలు జరుపుతారు. పెద్ద మొబైల్ షాపుల్లో అమ్మకాలు జరిగేటప్పుడు జీఎస్టీ బిల్ కస్టమర్లకు ఇవ్వాలి. కాని ఈ మహాదేవ్ మొబైల్స్‌లో నో బిల్స్ నో జీఎస్టీ ఓన్లీ మహాదేవ్ మొబైల్స్ అంతే అనేది వారి వాదన. అధికార యంత్రాంగం కనీసం తనిఖీలు నిర్వహించిన సందర్భాలు కూడా లేవు అని చెప్పవచ్చును. వైరా పట్టణంలో పెద్ద ఎత్తున నకిలీ అమ్మకాలు జరుపుతూ బ్రాండెండ్ పేరుతో మోసం చేస్తున్నారు. ఎవరు పోయినా సరే బిల్లు ఇవ్వం సరుకు కొంటే కొనండి లేకుండా లేదు. ఇది వారి విధానం. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని నిబంధనలకు విరుద్ధంగా బ్రాండెడ్ పేరుతో సెకండ్ క్వాలిటీ విక్రయాలు జరుగుతున్న మహాదేవ్ మొబైల్‌పై చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా కస్టమర్లకు జీఎస్టీ ఎందుకు ఇవ్వడం లేదు అనే దానిపై కూడా విచారణ జరపాలి. లక్షల రూపాయల అమ్మకాలతో జీఎస్టీని పక్కదోవ పట్టిస్తున్నారు అనే వాదన కూడా వినిపిస్తుంది.

# అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

**-మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**



ప్రజాపక్షం/దమ్మపేట: అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం ఖమ్మం ఎంపీ, దిశా కమిటీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రామసహాయం రఘురాంరెడ్డి, అశ్వారావుపేట ఎంఎల్ఏ జారె ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి మండలంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ముందుగా ఆదివాసీ కొండరెడ్డి గిరిజన గ్రామాలైన పూసుగూడెం, కట్కూరులో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం పట్వారిగూడెం, పాకలగూడెం మధ్య నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. స్థానిక రైతు వేదికలో రాచూరుపల్లి, మల్లారం గ్రామాలకు చెందిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు అర్హత పత్రాలు అందజేశారు. పట్వారిగూడెంలో పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మొద్దులగూడెం, రెడ్యాలపాడు మధ్య రైతులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. మొద్దులగూడెంలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు అర్హత పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ పేదల గృహ కలలను సాకారం చేయడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి అర్హత కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఆత్మ కమిటీ ఛైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ వాసం రాణి, నాయకులు కక్కిరాల రమేష్, చిన్నంశెట్టి యుగేందర్, చామర్తి గోపిశాస్త్రి, పగడాల రాంబాబు, జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రతే లక్ష్యం

**-ఆకతాయిలకు ఎస్ఐ మేడా ప్రసాద్ హెచ్చరిక**
**-మహిళలు, విద్యార్థులు నిర్భయంగా తిరిగే వాతావరణం కల్పిస్తాం**



ప్రజాపక్షం/బూర్గంపాడు : మండలంలో ప్రజలు ప్రశాంతంగా జీవించేలా, మహిళలు, విద్యార్థులు నిర్భయంగా సంచరించేలా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని బూర్గంపాడు ఎస్ఐ మేడా ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన ప్రజాపక్షంలో ముచ్చటించారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే ఆకతాయిలు, అసాంఘిక శక్తులపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని హెచ్చరించారు. మహిళలు, విద్యార్థులు, వృద్ధులు భయాందోళనలు లేకుండా తమ దైనందిన జీవితాన్ని కొనసాగించేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా బస్టాండ్లు, ప్రారంభం కానున్న పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో యువతులను వేధించడం, ర్యాష్ డ్రైవింగ్ చేయడం, బైక్‌లతో విన్యాసాలు చేయడం, గ్రామాల్లో గొడవలు సృష్టించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. గంజాయి విక్రయాలు, గుడుంబా తయారీ, పేకాట శిబిరాలు, అక్రమ ఇసుక రవాణా, అక్రమ గోవుల రవాణా, బెల్ట్ షాపుల నిర్వహణ వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. సమాచారం అందిన వెంటనే పోలీసు బృందాలు రంగంలోకి దిగి చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. సారపాక, లక్ష్మీపురం గ్రామాల్లో కూడా ప్రత్యేక నిఘా కొనసాగుతోందన్నారు. వలస కూలీల ముసుగులో నేరాలకు పాల్పడే వ్యక్తుల కదలికలను గమనిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇటీవల నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 11 మందిని పట్టుకుని కోర్టులో హాజరుపరచగా, వారిలో ఇద్దరికి జైలు శిక్ష విధించబడిందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాత్రి గస్తీని మరింత ముమ్మరం చేసి గ్రామాలు, ప్రధాన కూడళ్లు, రహదారులపై పర్యవేక్షణ పెంచినట్లు వెల్లడించారు. ఈసందర్భంగా ప్రజలకు ప్రత్యేక విజ్ఞప్తి చేస్తూ, తమ ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణా లేదా ఇతర నేర సంబంధిత సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. శాంతి భద్రత విషయంలో ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గేది లేదని, చట్టం ముందు అందరూ సమానమే, ప్రజల భద్రత కోసం పోలీసులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటారని ఎస్ మేడా ప్రసాద్ స్పష్టం చేశారు. డీఎస్‌పి సతీష్ కుమార్ , సీఐ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు రాష్ట్ర డీజీపీ సూచనలను కట్టుదిట్టంగా అమలు చేస్తూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

## నేడు కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయండి



ప్రజాపక్షం/పాల్వంచ : రోజు రోజుకు పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, గ్యాసు నిత్యావసర ధరలను వెంటనే తగ్గించాలంటూ సిపిఐ ఆధ్వర్యంలో నేడు తలపెట్టిన కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాకు అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సిపిఐ నాయకులు మంగళవారం మండలంలోని నారాయణరావు పేట, నాగారం, భోజ్యాతండా, తోగ్గూడెం, నాగారం కాలని, రంగాపురం, బిక్కుతండా, సోములగూడెం, పునుకుల, లక్ష్మీదేవిపల్లి (ఎస్) బసవతారక కాలని, కోడిపుంజులవాగు, కిన్నెరసాని, పాండురంగాపురం, మొండికట్ట, ఉల్వనూర్, రేగులగూడెం తదితర గ్రామాలలో కరపత్రాలు పంచిపెట్టి విస్తృత ప్రచారం చేశారు. ఈ సంధర్భంగా సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, జిల్లా నాయకులు నిమ్మల రాంబాబులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ ప్రజలపై పన్నుల భారాన్ని మోపుతోందని విమర్శించారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్‌తో పాటుగా అన్ని రకాల సరుకుల ధరలను పెంచి పేద మధ్య తరగతి కుటుంబాల ప్రజలను కొనలేని, తినలేని పరిస్థితిలోకి నెట్టి వేస్తున్నదన్నారు. అంతర్జాతీయంగాక్రూడాయిల్ ధరలు తగ్గినప్పటికి మన దేశంలో ధరలను పెంచతుందని ఆరోపించారు. పండించిన పంటలకు సరైన మద్దతు ధర లేకపోవటంతో రైతాంగం నష్టాల భారిన పడిందన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైనదని సాగుకు కావలసిన ఎరువులు, విత్తనాలు పెరిగి పంట పెట్టుబడి పెరిందని వాపోయారు. అధిక ధరలను తగ్గించి రైతాంగానికి కావలసిన ఎరువులు, విత్తనాలను సరిపడా ఉచితంగా అందజేయాలని, పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషాలు పాల్గొంటారని కావునా ప్రజలు అన్ని గ్రామాల నుండి అధిక సంఖ్యలో హాజరై ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖల కార్యదర్శులు, ప్రజా సంఘాల నాయకులు, సర్పంచ్‌లు మేకా రాంబాబు, జి. నాగయ్య, సత్యనారాయణరెడ్డి, వినోద్, సాయిలు శ్రీను, రంజిత్, సిహెచ్ శ్రీను, జర్పుల మోహన్, రాంబాబు, ప్రశాంత్, సంతోష్, తేజావత్ వినోద్, మాలోత్ హరి, భూక్యా ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల కొరతతో ములకలపల్లి కుదేలు

ప్రజాపక్షం/ములకలపల్లి: అధికారుల కొరతతో ములకలపల్లి కుదేలు అవుతుందని, పూర్తి స్థాయి అధికారులను నియమించాలని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి అనుముల సాయి కిరణ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ములకలపల్లి మండలంలో మండల విద్యాశాఖ అధికారి, మండల అభివృద్ధి అధికారి, తహసీల్దార్ పోస్టులతో పాటు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల కొరత తీవ్రంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్‌చార్జ్ అధికారులతోనే కార్యాలయాలు నడవడంతో రైతులు, విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వైద్య సేవలు కూడా దెబ్బతింటున్నాయని అన్నారు. వెంటనే పూర్తి స్థాయి అధికారులను, వైద్యులను నియమించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ప్రజలు, విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## సోంపల్లి ప్రశాంత్‌కు తాటి పరామర్శ



ప్రజాపక్షం/ములకలపల్లి: ములకలపల్లి మండలం సుబ్బనపల్లి గ్రామానికి చెందిన ఫైర్ ఎస్ఐ సోంపల్లి శ్రీనివాసరావు కుమారుడు సోంపల్లి ప్రశాంత్ ప్రమాదవశాత్తు కంటికి గాయపడగా బూర్గంపాడు, అశ్వారావుపేట మాజీ ఎంఎల్ఏ, తెలంగాణ రాష్ట్ర తొలి మాజీ ట్రైకార్ ఛైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు తాటి వెంకటేశ్వర్లు వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈసందర్భంగా ప్రశాంత్ ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ములకలపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ముందిగొండ శ్రీనివాస్, చెల్లా మాలాద్రి తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహాన్ని యథాస్థానంలో ప్రతిష్టించే వరకు ఉద్యమం కొనసాగిస్తాం



ప్రజాపక్షం/అశ్వాపురం : అశ్వాపురం మండల కేంద్రంలో గత 15 రోజుల క్రితం ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని అర్ధరాత్రి పోలీస్ బలగాల నడుమ అధికారులు ఇష్టం వచ్చినట్లు జేసీబీతో లాగించి ఆర్ అండ్‌బీ కార్యాలయం పక్కన చెత్తలో పడేసారని ఆరోపిస్తూ దళిత సంఘాల ఆధ్వర్యంలో 15వ రోజు నిరసన కార్యక్రమం నిర్వహించారు. రోజువారీ ఆందోళన కార్యక్రమంలో భాగంగా చెత్తకుప్పలో పడేసిన విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహాన్ని ఎక్కడైతే తొలగించారో మళ్లీ అదే స్థానంలో ప్రతిష్ఠించే వరకు నిరంతరం ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో దళిత నాయకులు, అంబేద్కర్‌వాదులు, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## కాలువల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి

ప్రజాపక్షం/అశ్వాపురం : అశ్వాపురం గ్రామంలో ఆర్‌అండ్‌బీ బీటీ రోడ్డు విస్తరణ పనులు పూర్తవడం ఆనందకరమైన విషయమే అయినప్పటికీ, రోడ్డు విస్తరణ కారణంగా ఇరువైపులా ఉన్న సైడ్ కాలువలు పూర్తిగా ధ్వంసమయ్యాయని గ్రామ సర్పంచ్ బానోత్ సదర్ లాల్ అన్నారు. రోడ్డు పనుల సమయంలో ధ్వంసమైన కాలువలను గతంలో ఉన్న విధంగానే పునర్నిర్మించి గ్రామ పంచాయితీకి అప్పగిస్తామని అధికారులు హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటి వరకు ఆ పనులు పూర్తి చేయలేదన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా కాలువల్లో మట్టి పేరుకుపోవడంతో వర్షపు నీరు ఇళ్లలోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అందువల్ల కాలువల్లో పేరుకుపోయిన మట్టిని వెంటనే తొలగించి, ధ్వంసమైన డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించి గ్రామ పంచాయితీకి సహకరించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను సర్పంచ్ బానోత్ సదర్ లాల్ కోరారు.

## నేడు సిపిఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి

**-కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలి**
**-సీపీఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు**




ప్రజాపక్షం/జూలూరుపాడు: కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించి సామాన్య ప్రజలపై భారాన్ని తగ్గించాలని కోరుతూ నేడు కొత్తగూడెం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. కార్పొరేట్ శక్తులతో కుమ్మక్కై ఆదానీ అంబానీ లాంటి వారికి దేశ సంపదను దోచిపెడుతున్న కేంద్ర ప్రభుత్వం, ప్రజలపై మోయలేని బారాలను మోపుతూ ప్రజలు మరింత పేదవాలుగా తయారు చేసేందుకు బిజెపి నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం కారణమవుతుందని ఒకవైపు నిరుద్యోగం ఆకలి చావులు ఆత్మహత్యలు పెరుగుతున్న తరుణంలో మరోవైపు మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందాగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ భారం సామాన్య ప్రజల పాలిట శాపంగా మారాయి అన్నారు. చౌక దుకాణాల ద్వారా నిత్యవసర వస్తువులు అందించాలని డిమాండ్ చేస్తూ నేడు ఉదయం 10 గంటలకు జరిగే కలెక్టరేట్ ముట్టడికి జులూరుపాడు మండలం నుంచి పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# రైతులకు మరింత చేరువగా సహకార బ్యాంకింగ్ సేవలు

**- మంత్రులు పొంగులేటి, తుమ్మల**
**- మున్సిపాలిటీపరిధిలో డిసిసిబి బ్యాంక్ ప్రారంభం**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** రైతులకు మరింత చేరువగా సహకార బ్యాంకింగ్ సేవలు అందనున్నాయని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్డులో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) కరుణగిరి బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ...రైతులు స్వయం సహాయక సంఘాలు, చిన్న వ్యాపారులు, సాధారణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి తీసుకోరావడంలో ఈ నూతన శాఖ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సహకార బ్యాంకింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు నాణ్యమైన ఆర్థిక సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సహకర రంగం అభివృద్ధి చెందితే రైతులు ఆర్థికంగా మరింత బలోపేతం అవుతారని, వ్యవసాయ రుణాలు, పొదుపు పథకాలు, ఇతర బ్యాంకిగ్ సేవలు ప్రజలకు సత్వరంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. డీసీసీబీ విస్తరణతో స్థానిక ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, సిపి సునీల్‌దత్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు రాంరెడ్డి చరణ్ రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్‌బాబా, మున్సిపాలిటీ చైర్మన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్‌బాబు, కమీషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, డీసీఓ గంగాధర్, కౌన్సిలర్లు బుర్రా మహేష్, ప్రసాద్, దివ్య, మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# రూ. 4లక్షల ఎల్‌వోసి చెక్కు అందజేత



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 4లక్షల ఎల్‌వోసి చెక్కును కాంగ్రెస్ యువ నాయకులు తుమ్మల యుగంధర్ బాధిత కుటుంబానికి అందజేశారు. ఖమ్మం నగరంలోని 31వ డివిజన్‌కు చెందిన రామకృష్ణ అనే వ్యక్తి గుండె సంబంధిత సమస్యతో బాధపడుతూ ఆర్థిక పరిస్థితి బాగాలేక స్థానిక నాయకుల ద్వారా యువ నాయకులు తుమ్మల యుగంధర్‌ను కలిశారు. తుమ్మల యుగంధర్ వెంటనే స్పందించి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి సిఫారసు చేశారు. తుమ్మల యుగంధర్ ప్రత్యేక చొరవతో మంజూరైన రూ. 4లక్షల ఎల్‌వోసి చెక్కును హైదరాబాద్‌లో అందజేశారు. విషయం తెలుసుకున్న వెంటనే స్పందించి వైద్యానికి అయ్యే ఖర్చును మంజూరు చేయించి అండగా నిలిచిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు, యువ నాయకులు తుమ్మల యుగంధర్‌కు బాధితుడు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ షేక్ లతీఫ్, కరాటే సైదులు తదితరులు పాల్గొన్నారు.

# సాయిల్ టెస్ట్ పనులు అడ్డగింత



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** నాగపూర్ అమరావతి జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి సాయిల్ టెస్ట్ పనులను భూ, ప్లాట్ యజమానులు అడ్డుకున్న సంఘటన మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. నాగపూర్ అమరావతి జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా వి. వెంకటాయపాలెం కలెక్టరేట్ సమీపంలో సాయిల్ టెస్ట్ నిర్వహిస్తున్నారన్న సమాచారం అందుకున్న బాధిత రైతులు, ప్లాట్ యజమానులు ఆ ప్రాంతానికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. భూ సేకరణకు సంబంధించి హైకోర్టులో మధ్యంతర ఉత్తర్వులు ఉన్న నేపథ్యంలో పనులు చేపట్టడం తగదని సాయిల్ టెస్ట్ ఏజెన్సీ ప్రతినిధులకు బాధితులు తెలియజేశారు. దీనితో ఏజెన్సీ ప్రతినిధులు సాయిల్ టెస్ట్ పనులను నిలిపివేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. భూ సేకరణ ప్రక్రియ పూర్తి కాక ముందే పనులను అప్పగించడం చట్ట విరుద్ధమని బాధితులు వాపోయారు. పలుమార్లు ఎన్‌హెచ్ అధికారులకు, రెవెన్యూ అధికారులకు సమస్యను వివరించినట్లు బాధితులు తెలిపారు. హైకోర్టు తీర్పు వచ్చే వరకు ఎటువంటి పనులు చేపట్టవద్దని బాధిత రైతులు, ప్లాట్ యజమానులు కోరారు.

# పోక్సో కేసు నిందితున్ని కఠినంగా శిక్షించాలి

**-కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి**
**-ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ డిమాండ్**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మంలో మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడి భవనం పైనుంచి క్రిందకు నెట్టి హత్య చేయాలని ప్రయత్నించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని భారత మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) డిమాండ్ చేసింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని వారు కోరారు. ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ సీనియర్ నాయకురాలు పోటు కళావతి, జిల్లా అధ్యక్షురాలు బత్తినేని నీరజ, జిల్లా నాయకురాలు తాటి నిర్మల తదితర మహిళా సమాఖ్య బృందం మంగళవారం చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శించారు. అత్యున్నత వైద్య సేవలు అందించాలని కోరుతూ బాలిక ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మహిళా సమాఖ్య బాధ్యులు మాట్లాడుతూ ఇటీవల కాలంలో లైంగిక దాడులు, వేధింపులు, అత్యాచార యత్నాలు పెరుగుతున్నాయన్నారు. అభం శుభం తెలియని మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడటమే గాక హత్య చేయాలని ప్రయత్నించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ ఘటనకు సంబంధించి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా బాలికకు సత్వర న్యాయం జరిగేవిధంగా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి రూ. 50 లక్షల పరిహారం అందించడంతో పాటు ఆ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని వారు కోరారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితున్ని కఠినంగా శిక్షించాలని వారు కోరారు.

# కుంగిపోయిన రహదారి..!

**అధికారులు హడావుడి ఫలితమేనా?**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఖమ్మం కొరవి రహదారి మంగళవారం కుంగిపోవడం అధికారుల పనితీరుపై తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ముత్తగూడెం గ్రామానికి చెందిన రైతు మొహ్మద్ మౌలానా పట్టా భూమి వివాదం నేపథ్యంలో అధికారులు హడావుడిగా రహదారి ఏర్పాటు చేయడమే ఈ పరిస్థితికి కారణమైందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజల ప్రయోజనాల కంటే వివాదాన్ని త్వరగా ముగించాలనే ఆత్రుతతో నిబంధనలను పక్కనబెట్టి చేపట్టిన పనుల ఫలితంగానే రహదారి కుంగిపోయిందని స్థానికులు మండిపడుతున్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పూర్తిగా విస్మరించారని, సంబంధిత అధికారులు కేవలం పైపై చర్యలకే పరిమితమయ్యారని ఆరోపిస్తున్నారు. ప్రధాన రహదారి ఇలా కుంగిపోవడం వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడటమే కాకుండా, అధికారుల నిర్లక్ష్యం బట్టబయలైందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాధనం వెచ్చించి చేపట్టిన పనులు కొద్ది రోజుల్లోనే కుంగిపోవడం వెనుక బాధ్యులైన అధికారులు, కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా గుంత కానరాకుండా మట్టిపోయడం విశేషం.

# గిరిజనులను గాయపరిచిన ఫారెస్ట్ అధికారులపై కేసులు పెట్టాలి




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** గత కొన్నేళ్లుగా పోడు భూములను సాగు చేసుకున్న గిరిజనులపై అటవీశాఖ అధికారులు అక్రమంగా దాడులు చేసి, గాయపరిచారని తక్షణమే గిరిజనులను గాయపరిచిన ఫారెస్ట్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు సిపిఐ యం ఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావులు. మంగళవారం స్థానిక నీలం రామచంద్రయ్య భవనం నుంచి కాకర్లపల్లి రోడ్డు పాత సెంటర్ నుండి రింగ్ సెంటర్ మీదుగా భారీ ప్రదర్శన ర్యాలీని మండల తహశీల్దార్ కార్యాలయం వరకు నిర్వహించి తహశీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. సోమవారం గుడిపాడు పోడు భూముల వద్ద జరిగిన గిరిజనులు, ఫారెస్ట్ అధికారులకు మధ్య జరిగిన ఘర్షణలో ఒక మహిళ పైకి జీపు పోనివ్వటంతో కాలు విరగిందని, అనేకమంది గిరిజన మహిళలను గాయపరిచిన ఫారెస్ట్ అధికారులపై కేసు పెట్టి, తగిన విధంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గిరిజనుల సాగు చేసుకుంటున్న భూములలో రెండవ సారి ట్రెంచ్ కొట్టడం దుర్మార్గమని, సర్వే చేసిన 25 ఎకరాల కు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలను అధికారులు వెంటనే ఇవ్వాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోర్ట్ రంగారావు, జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు లు కోరారు. అనేక సంవత్సరాల నుంచి గుడిపాడు గిరిజనుల పోడు సాగు చేసుకుంటున్నారని, ఫారెస్ట్ అధికారులు ఇబ్బందులు ఎదుర్కొని నిలబడ్డారని, చివరకు గతంలో హద్దులు పెట్టి ఫారెస్ట్ అధికారులు ట్రెంచ్ కొట్టి 80 ఎకరాలు గిరిజనులకు కేటాయించారన్నారు. అందులో 60 ఎకరాలకు పట్టాలిచ్చి, ఉద్వేశపూరకంగానే 20 ఎకరాలకు సర్వే చేసి పట్టాలు ఇవ్వలేదని వాపోయారు. అనేకసార్లు ఆ భూముల్లో పంటలు పీకేసారని వీటివల్ల తిరిగి రెండోసారి ట్రెంచ్ కొట్టి 20 ఎకరాలు ఆదివాసులకు చెందకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యాన్ని తక్షణమే ఖండిస్తూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆదివాసీల పోడు భూములలో కందకాలు తీసే గిరిజన వ్యతిరేక చర్యలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఫారెస్ట్ అధికారులు ఆదివాసీలపై దౌర్జన్యాలను ఆపకపోతే వారి భూములను ఆక్రమించుకోవాలని ప్రయత్నం చేస్తే ప్రజలు తిరుగుబాటును ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి ఏ వెంకటరెడ్డి, జిల్లా నాయకులు గోకినపల్లి లలిత, గంట శ్రీను, అమర్లపూడి శరత్, తాటి రాజు ,ఎస్కే లాల్మియా, బీరెల్లి లాజర్, డి శ్రీనివాసరావు, కోర్సు వెంకటేష్, కందిమల్ల నాగప్రసాద్, రాజారావు, నాగరాజు, శ్రీనివాసరావు, వెంకట నరసమ్మ, బేతి దుర్గ ,చెల్లమ్మ, రజిని, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పోస్టులు 12.. దరఖాస్తులు 242



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని ఆరు ప్రభుత్వ పాఠశాలల్లో బోధకులు సహాయకులు పోస్టులకు దరఖాస్తులు నేటితో ముగిశాయి మర్లపాడు 23 దరఖాస్తులు, కల్లూరు ప్రాథమిక పాఠశాల 89, కొత్త బోడిమెల్ల 18, అంబేద్కర్ నగర్ 56, నారాయణపురం 17 ,చిన్న కోరుకొండి 37 ,దరఖాస్తులు అందినట్లు ఎంఈఓ నివేదిత తెలిపారు. మండల కమిటీ ద్వారా ఎంపికలు జరుగుతాయని ఎంఈఓ తెలిపారు.

# జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/చింతకాని :** జగన్నాథపురం రైతు వేదిక నుండి పందిళ్లపల్లి పిఆర్ రోడ్డు వయా నూతన వ్యవసాయ మార్కెట్ బీటీ రోడ్డు జంగిల్ క్లియరెన్స్ పనులను మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ రూ.4.5 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ రహదారి నిర్మాణంతో రైతులకు మెరుగైన రవాణా సౌకర్యం ఏర్పడుతుందన్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరీ చేసిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు స్థానిక రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగన్నాథపురం సర్పంచ్ తాళ్లూరి స్వప్న, మార్కెట్ కమిటీ డైరక్టర్ బందెల నాగార్జున ,మత్కేపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంచం కోటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు బొల్లికొండ రామారావు, తాళ్లూరి రమేష్, నర్శింశెట్టి చలమయ్య పాల్గొన్నారు.

# ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ :** పట్టణంలోని 20వ వార్డులో పారిశుద్ధ్యపనులు ముమ్మరంగా సాగుతున్నట్లు వార్డుకౌన్సిలర్ బొల్లెద్దు విజయకుమారి పేర్కొన్నారు. వార్డులో మురుగుకాలువలో బురద , చెత్త పేర్కొని ఉండటంతో వర్షాకాలం సమీపిస్తున్నక్రమంలో తగు ముందస్తుచర్యలుగా మురుగుకాలువలో పేరుకుపోయిన చెత్తను తొలిగిస్తున్నట్లు తెలిపారు.

# అశ్వారావుపేట అభివృద్ధికి భారీ ఊతం

- రూ.250 కోట్ల యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌కు భూమిపూజ
- ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభం
- సిసి రోడ్ల ఆవిష్కరణ, అర్బన్ పార్కుకు శంకుస్థాపన
- పాల్గొన్న మంత్రి పొంగులేటి, ఎంపి రఘురాంరెడ్డి





ప్రజాపక్షం/అశ్వారావుపేట : అశ్వారావుపేట నియోజకవర్గంలో ప్రభుత్వం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి, అశ్వారావుపేట ఎంఎల్‌ఎ జారే ఆదినారాయణ విద్యా,గృహ నిర్మాణం, మౌళిక వసతుల, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన పలు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. దమ్మపేట మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం క్రింద నిర్మించిన గృహాలను మంత్రి ప్రారంభించి లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అందజేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ పేదలకు సొంతింటి కలను సాకారం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన ప్రతీ కుటుంబానికి గృహవసతి కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం దమ్మపేట మండలంలో పలు గ్రామాల్లో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల మౌళిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యంత ఇస్తోందని,రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట పట్టణంలో రూ.250కోట్ల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు మంత్రి, ఎంపి, ఎంఎల్‌ఎ సంయుక్తంగా భూమిపూజ చేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అత్యాధునిక విద్యా సదుపాయాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. విద్యావ్యవస్థలో డిజిటల్ తరగతి గదులు, సైన్స్, కంప్యూటర్ ప్రయోగ శాలలు, గ్రంధాలయం, క్రీడా మైదానాలు, హాస్టల్ సదుపాయాలు అందుబాటులో ఉండనున్నట్లు చెప్పారు. అనంతరం ఎంపి మాట్లాడుతూ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నియోజకవర్గ విద్యారంగానికి కొత్త గుర్తింపు తీసుకురానుందన్నారు. స్థానిక విద్యార్థులు నాణ్యమైన విద్య కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పనిలేకుండా అత్యున్నత స్థాయి విద్యను ఇక్కడే పొందే అవకాశం ఉందన్నారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడం కోసం, పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా అర్బన్ పార్కును అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. వాకింగ్ ట్రాక్‌లు, పిల్ల ఆట స్థలాలు, ఓపెన్ జిమ్, విశ్రాంతి మండపాలు, పచ్చని మొక్కలు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. అశ్వారావుపేటను రాష్ట్రంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ అంకిత్, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, యువజన నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అండర్ 15 బాక్సింగ్ పోటీల్లో విజేతల ఎంపిక



ప్రజాపక్షం/భద్రాచలం : భద్రాచలంలో నిర్వహించిన అండర్ 15 బాక్సింగ్ పోటీల్లో విజేతలను ఎంపిక చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు, రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బండారి ఎల్లయ్య ఆధ్వర్యంలో మంగళవారం గ్రిప్ ఎంఎంఎ జిమ్‌లో ఈ పోటీలు జరిగాయి. బాలికల విభాగంలో కే భావన, ఆర్ అక్షయ, భవాని, ఎం హాసిని విజేతలుగా నిలవగా, బాలుర విభాగంలో ఆర్ గణేష్, ఎం గణేష్, ఏ జోనాథన్, కే సోహిత్ ఆర్ రేవంత్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారికి ఈనెల 14న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహించనున్నారు. పోటీలలో బాక్సింగ్ కోచ్ పఠాన్ యాకూబ్, ఎస్‌కే అర్షద్, కీలక పాత్ర పోషించారు. చీఫ్ ప్యాట్రన్ ఎర్ర కామేష్ విజేతలను అభినందిస్తూ ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు.

# యువకుని బలవన్మరణం



ప్రజాపక్షం/అశ్వారావుపేట : ఒంటరి జీవితంతో విసిగిపోయి చెరువులో దూకి సరియం కాంత్ కుమార్ (20) అనే యువకుడు బలన్మరణం పొందిన విషాదఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దుబ్బతోగు గ్రామానికి చెందిన మృతుని తల్లి అక్రమ సంబంధం పెట్టుకుని వేరే వెళ్లిపోవడంతో చాలా కాలంగా మనస్తాపంతో ఉంటున్నాడు. తాను ఒంటరిని అనే ఆవేదన వెంటాడుతోంది. దీంతో యువకునికి జీవితం మీద విరక్తి కలిగి మృతి చెందాడు. సోమవారం రాత్రి ఇంటి నుండి బయటకు వెళ్లిన కాంత్ మంగళవారం ఉదయం కూడా ఇంటికి రాకపోవడంతో బంధువులు గాలింపు చర్యలు మొదలు పెట్టారు. ఈ లోగా గ్రామ సమీపంలో ఉన్న చెరువులో మృతదేహం కనిపించడంతో చెరువులో నుండి బయటకు తీసి గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. యువకుడు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకోగా, కొడుకు మృతికి కారణమైన తల్లి గ్రామస్తులతో పాటు బంధువర్గం తిట్టిపోస్తున్నారు.

# పురోగతిలో నక్ష సర్వే పనులు : కలెక్టర్



ప్రజాపక్షం/మణుగూరు : భూముల రీసర్వే, పట్టణ భూముల హద్దుల గుర్తింపు (నక్ష) కార్యక్రమాల పురోగతిపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. రాష్ట్రంలో వివాదాలు లేని పారదర్శక భూపరిపాలన వ్యవస్థను తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం డిజిటల్ సర్వే కార్యక్రమాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ నక్ష పైలట్ ప్రాజెక్టులకు ఎంపికైన జిల్లాల్లో సర్వే మరియు రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేసి క్షేత్ర స్థాయిలో రోవర్ పరికరాల ద్వారా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ఆస్తులకు ఖచ్చితమైన సర్వే చేపట్టి, రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్‌ఓఆర్) నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఐడీఓసీ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నక్ష పైలట్ ప్రాజెక్టు కింద జిల్లాలోని మణుగూరు మున్సిపాలిటీ ఎంపికైందని తెలిపారు. ప్రాజెక్టు అమలులో భాగంగా సర్వే , రెవెన్యూ శాఖల ద్వారా క్షేత్రస్థాయిలో సర్వే పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. మున్సిపల్ శాఖ ద్వారా ఆర్‌ఓఆర్ నమోదు ప్రక్రియ ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని వివరించారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 15 రెవెన్యూ వార్డులు ఉండగా, వాటిని 97 బ్లాక్‌లుగా విభజించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ప్రాంతంలో సుమారు 7,524 ఆస్తులను గుర్తించడం జరిగిందని, వాటిలో 5,064 ఆస్తుల సర్వే పూర్తయిందని చెప్పారు. అలాగే 2,074 ఆస్తులకు సంబంధించిన డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. నక్ష ప్రాజెక్టు లక్ష్యాలను నిర్దేశిత గడువులో పూర్తి చేసి ప్రజలకు పారదర్శకమైన భూ రికార్డులను అందుబాటులోకి తీసుకురావడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పనిచేస్తున్నాయి అని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఏడి సర్వే శ్రీనివాస్,మణుగూరు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జనరల్ సర్జన్ వైద్యున్ని నియమించాలి



ప్రజాపక్షం/భద్రాచలం : స్థానిక ఏరియా ఆస్పత్రిలో జనరల్ సర్జన్ వైద్యున్ని నియమించాలని సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపందా డివిజన్ నాయకులు సాయన్న అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆ పార్టీ ప్రతినిధి బృందం సందర్శించింది. ఈ సందర్భంగా సాయన్న మాట్లాడుతూ ఆస్పత్రిలో వైద్యుల విషయంపై ఆరా తీయగా డాక్టర్ల కొరత ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. నాలుగు రాష్ట్రాల కూడలైన భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో 62 మంది వైద్యులకు గానూ కేవలం 21 మందితో మాత్రమే నెట్టుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాలోత్ పార్వతి అనే మహిళ కుమారునికి కడుపులో కొద్ది అయి వైద్యం కోసం ఇక్కడికి రాగా కొత్తగూడెం ఆస్పత్రికి వెళ్లి ఆపరేషన్ చేయించుకోవాలని డ్యూటీ డాక్టర్ చెప్పడం దుర్మార్గమన్నారు. ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలు చేసేందుకు వైద్యులు లేకపోవడం చాలా విచార కరమని, ఏజెన్సీ ప్రాంత ప్రధాన కేంద్రమైన భద్రాచలం ఆస్పత్రికి రోగుల తాకిడి అధికంగా ఉంటుందని, అలాంటప్పుడు వైద్యులు లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. ప్రజారోగ్యం పట్ల పాలకుల శ్రద్ధ చూపి ప్రజలందరికీ అన్ని రకాల ప్రభుత్వ వైద్య సేవలు అందుబాటులోనికి తేవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కణితి నర్సింహారావు, మాలోత్ పార్వతి తదితరులున్నారు.

# మాచినేనిపేట తండా వద్ద రోడ్డు ప్రమాదం

- ఆర్టీసీ బస్సు, యాష్ ట్యాంకర్ లారీ ఎదురెదురుగా ఢీ
- లారీ, బస్ డ్రైవర్లకు తీవ్ర గాయాలు
- సురక్షితంగా బయట పడ్డ ప్రయాణికులు





ప్రజాపక్షం/జూలూరుపాడు: జూలూరుపాడు మండల పరిధిలోని మాచినేని పేట తండా సమీపంలో మంగళవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఎదురెదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు మరియు లారీ ఢీకొనడంతో రెండు వాహనాలు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలో లారీ, డ్రైవర్ కోటయ్య, ఆర్‌టిసి అద్దె బస్ డ్రైవర్ సాంబశివరావులు తీవ్ర గాయాలకు గురయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.... హైదరాబాద్ నుండి భద్రాచలం డిపోకి వెళ్తున్న ఆర్టీసీ బస్సు, పాల్వంచ నుండి జగ్గయ్యపేట రాంకో సిమెంట్ ఫ్యాక్టరీకి వెళ్తున్న యాష్ ట్యాంకర్ లారీ మాచినేని పేట గ్రామ సమీపానికి చేరుకున్న సమయంలో ఎదురెదురుగా యాష్ ట్యాంకర్, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రభావంతో రెండు వాహనాల ముందు భాగం, ముఖ్యంగా డ్రైవర్ వైపు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రమాదం సమయంలో బస్సులో ఉన్న 42 మంది ప్రయాణికులు సురక్షితంగా బయట పడటంతో తృటిలో పెను ప్రమాదం తప్పింది. ఆ సమయంలో ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనతో కేకలు వేయడంతో అక్కడి ప్రాంతంలో ఆందోళనకర పరిస్థితి నెలకొంది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో జూలూరుపాడు పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సమాచారం అందుకున్న సుజాతనగర్ అంబులెన్సు సిబ్బంది డ్రైవర్ సాయి కృష్ణ, ఈఎంటి మహేందర్ గాయపడిన డ్రైవర్లను 108 అంబులెన్స్ లో ప్రథమ చికిత్స అందించి కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జూలూరుపాడు పోలీసులు తెలిపారు. ప్రమాదం కారణంగా కొంతసేపు ఆ మార్గంలో ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు వాహనాలను పక్కకు జరిపించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈ ఘటనతో మాచినేపేట గ్రామ పరిసరాల్లో ఉద్రిక్తత నెలకొంది.

# మండలంలో వీధి కుక్కల బెడద..!

ప్రజాపక్షం/చుంచుపల్లి: చుంచుపల్లి మండలంలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తోంది. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు రావడానికి కూడా భయపడుతున్న పరిస్థితి నెలకొంది. ఇటీవల పలుచోట్ల వీధి కుక్కలు గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడి చేసిన ఘటనలు వెలుగుచూశాయి. స్థానికుల సమాచారం ప్రకారం ఉదయం, సాయంత్రం సమయాల్లో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు కుక్కల దాడులకు గురవుతున్నారని, రాత్రులలో ద్విచక్ర వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తూ కొందరికి గాయాలు కావడంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. దీనికి తోడు కోతుల బెడద కూడా మండల ప్రజలను ఇబ్బందులపాలు చేస్తున్నట్లు మండల ప్రజలు వాపోతున్నారు. మండలంలో పలు చోట్ల పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం కనిపించడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు స్పందిస్తూ వీధి కుక్కల నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కుక్కలకు వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ కార్యక్రమాలు త్వరలో నిర్వహిస్తామని చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చిన్నపిల్లలను ఒంటరిగా బయటకు పంపవద్దని సూచించారు. స్థానిక ప్రజలు మాత్రం వెంటనే చర్యలు తీసుకుని వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వ అధికారులను కోరుతున్నారు.

# చింతకాని స్టాఫ్ నర్స్‌గా అనురాధ

ప్రజాపక్షం/చింతకాని : చింతకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్స్‌గా టేకుమట్ల అనురాధ నియమితులయ్యారు. మహబూబాబాద్ జిల్లా కురవి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో పనిచేస్తున్న ఆమె చింతకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీ అయ్యారు. మంగళవారం ఆమె విధుల్లో చేరారు.

# చింతకాని ఎస్ఐ వీరేందర్ బదిలీ

ప్రజాపక్షం/చింతకాని : చింతకాని ఎస్ఐ వీరేందర్ బదిలీ అయ్యారు. నూతన ఎస్ఐ గా రఘునాధపాలెం స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న జి నరేష్ చింతకాని రానున్నారు. అక్రమ ఇసుక రవాణా , సివిల్ పంచాయితీల్లో జోక్యం మొదలగు ఆరోపణల నేపథ్యంలో బదిలీ జరిగినట్లు విశ్వసనీయ సమాచారం

# ప్రభుత్వ భూమి ఇంచు కూడా వదలకండి

**-మంత్రి పొంగులేటి**
**ఎమ్మెల్యే దంపతులకు ప్రశంసలు**





**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ప్రభుత్వ భూమి ఎవరి కబ్జాలో ఉన్నా అంగుళం కూడా విడిచిపెట్టకుండా స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎమ్మెల్యేతో కలిసి వేశ్యకాంతల చెరువు ముంపు ప్రాంతాన్ని మంత్రి పొంగులేటి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వ భూమి అంటే అది పేదల భూమి అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. కబ్జాలో ఉన్న ప్రభుత్వ భూములను వెంటనే గుర్తించి, ఆక్రమణల నుంచి విముక్తి కల్పించాలని ఆదేశించారు. దాదాపు 315 ఎకరాల్లో విస్తరించి ఉండాల్సిన చెరువు భూమితో పాటు ముంపు, శిఖం, ఎఫ్‌టీఎల్ తదితర సర్వే నంబర్లలో ఉన్న ప్రభుత్వ భూములు బడా బాబుల ఆక్రమణలోకి వెళ్లినట్లు ఆరోపణలు ఉన్నాయని వాటిని తక్షణమే స్వాధీనం చేసుకోవాలన్నారు. ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు సుమారు 14 ఎకరాలు ఆక్రమించుకుని అనుభవిస్తున్నట్లు, కొంత మంది రాజకీయ నేతలు తలా రెండు, మూడు ఎకరాలు ఆక్రమించుకున్నట్లు స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో కొంత భూమికి దొడ్డిదారిలో పాస్‌బుక్కులు సంపాదించి, సాగుతో పాటు రైతుబంధు తదితర ప్రభుత్వ సబ్సిడీ పథకాలు కూడా పొందుతున్నట్లు సమాచారం. ఈ మొత్తం ప్రభుత్వ భూమిని చెర నుంచి విడిపించి, పేదల ఇళ్ల స్థలాల కోసం సిద్ధం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఆక్రమణలు తొలగించిన వెంటనే చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఖర్చులకు నిధులు అవసరమైతే కలెక్టర్‌తో మాట్లాడతానని, సిబ్బంది అవసరమైతే పక్క మండలాల నుంచి తీసుకోవాలని అధికారులకు సూచించారు. వారం రోజుల్లో కబ్జా నుంచి ప్రభుత్వ భూమి బయటకు రావాలని మంత్రి పొంగులేటి హుకుం జారీ చేశారు. అయితే సర్వే సమయంలో రైతుల ప్రైవేట్ పట్టా భూములకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రత్యేకంగా సూచించారు.

**ఎమ్మెల్యే దంపతులకు ప్రశంసలు...**

సత్తుపల్లి ప్రాంతంలో కబ్జాలలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి వెలికి తీస్తున్న ఎమ్మెల్యే దంపతులపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రశంసలు జల్లు కురిపించారు. ఇన్నేళ్లు ప్రభుత్వ భూములను దాచిపెట్టారని, ఇక మీ వల్ల కాదని ఇది ప్రజా ప్రభుత్వం అని సత్తుపల్లి ఎమ్మెల్యే లా ప్రతి ఒక్కరూ పనిచేస్తే ప్రతి నియోజకవర్గంలో వందల ఎకరాల ప్రభుత్వ భూమి బయటకు వస్తుందన్నారు. గ్రామకంఠం భూములు సైతం ఆక్రమణలో ఉన్నాయని వాటిని కూడా సర్వే చేసి కబ్జా కొరల నుండి విముక్తి కల్పించాలని ఎమ్మెల్యేకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, మున్సిపల్ చైర్మన్ ఎండి రెహానా బేగం, మున్సిపల్ కౌన్సిలర్లు హకీం, దూదిపాళ్ళ రాంబాబు, విరివాడ అపర్ణ నాగభూషణం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, బాల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతితో భూ సమస్యకు పరిష్కారం

**-ప్రజా దర్బార్‌కు అపూర్వ స్పందన : పొంగులేటి**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** భూ భారతి చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ధరణిలో సాదాబైనామాలకు అవకాశం ఇచ్చిన దానిని చట్టంలో చేర్చకుండా రైతులకు ద్రోహం చేశారని ఆయన ఆరోపించారు. మంగళవారం ఖమ్మంలో మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 926000 దరఖాస్తులను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకుందన్నారు. భూ విక్రయం చేసిన వారి సమ్మతి లేకుండానే రైతులకు భూమిపై హక్కు కల్పించేవిధంగా నిబంధనలను మార్చామని ఇప్పటికే ఐదున్నర లక్షల దరఖాస్తులను గుర్తించి నోటీసులను అందించామన్నారు. అర్హులైన సాదాబైనామాలను పరిష్కరిస్తామని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆధునీక డిజిటల్ సర్వే ద్వారా సాగు భూములను గుర్తించి పట్టాలు అందజేస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. తొలుత ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాలను గుర్తించి ఆధునీక భూ సర్వే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. తిరుమలాయపాలెం మండలం కాకరవాయిలో ఈ సర్వే పూర్తయిందని ఆయన తెలిపారు. నిర్ణీత కాలం పరిమితి లోగా ఇండ్లు, ఇండ్ల స్థలాలను కేటాయిస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రజా దర్బార్‌లో ఇచ్చిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపెడతామని ఆయన తెలిపారు. ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని కేవలం స్వలాభం కోసమే ప్రభుత్వంపై బురద చల్లుతున్నాయన్నారు. ప్రజల విశ్వాసం, నమ్మకమే ఈ ప్రభుత్వానికి బలమని ఆయన స్పష్టం చేశారు. పాలేరు నియోజక వర్గంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌కు అపూర్వ స్పందన లభించిందని ప్రజా దర్బార్‌లో వచ్చిన ప్రతి దరఖాస్తుకు పరిష్కారం చూపుతామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. మీడియా సమావేశంలో ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి పాల్గొన్నారు.

# ప్రజా పోరాటాలతోనే పార్టీ పటిష్టంగా ఉంటుంది

**సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం**



**ప్రజాపక్షం/కొణిజర్ల :** నిత్యం ప్రజల మధ్య ఉంటు ప్రజాసమస్యల పరిష్కారం దిశగా పనిచేస్తు ప్రజాపోరాటాలు నిర్వహిస్తేనే పార్టీ పునాది పటిష్టంగా ఉంటుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతురావు అన్నారు. మండల కేంద్రం కొణిజర్ల సిపిఐ గ్రామశాఖ ఒక్క రోజు రాజకీయ శిక్షణాతరగతులలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. శాస్త్ర సాంకేతిక రంగాలు అభివృద్ధిచెందుతుంటే యువత మాత్రం సమాజంగురించి ఆలోచించే స్థితిలో లేదని అన్నారు. డబ్బు సంపాదన, లగ్జరీగా జీవితాన్ని ఎంజాయ్ చేయాలనే ఆలోచనతోనే ఉన్నారని ఇది దేశానికి మంచిది కాదని తెలిపారు. తెలంగాణలో మనపార్టీ 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిపెట్టిందని అన్నారు. కమ్యూనిస్టుపార్టీ ఎక్కడ ఉందని కొంతమంది అంటున్నారని కమ్యూనిస్టుపార్టీ భారతదేశంలో లేకుండా ఉంటే ఈరోజు ఈమాత్రం కూడా పేదప్రజలకు హక్కులు వచ్చిఉండేవి కాదని అన్నారు. భూసంస్కరణ చట్టంద్వారా అక్కడో ఇక్కడో పేదోడికి ఎంతోకొంత భూమి వచ్చిందంటే కమ్యూనిస్టుపార్టీ నిర్వహించిన భూపోరాటాల వలన వచ్చిందని తెలిపారు. ఉపాధిహామి చట్టం కమ్యూనిస్టుల పోరాటంతోనే వచ్చిందని అన్నారు. 18 సంవత్సరాలకు ఓటు హక్కు, రైతాంగానికి గిట్టుబాటు ధర, పేదవాడికి అందుతున్న అనేక సంక్షేమ పథకాలు, మహిళలకు రక్షణ ఈవంద సంవత్సరాల్లో కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన పోరాటాల ద్వారానే ఈ విజయాలు సాధించామని స్పష్టంచేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతు నరేంద్రమోడి కేవలం స్వార్థ ప్రయోజనాలకోసమే దేవుడిని రాజకీయాల్లోకి తీసుకువచ్చాడని దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు మతోన్మాదం పేరుతో రాజకీయాలు చేస్తున్నాడని అన్నారు. భారతీయ జనతాపార్టీ అధికారంలోకి రాకముందు గ్రామాల్లో మనం దేవుడి పెండ్లి చేయలేదా అని అన్నారు. కమ్యూనిస్టులు ఎవరైనా వ్యతిరేకించారా ప్రజల మనోభావాలు గౌరవించడంలో కమ్యూనిస్టుపార్టీ ఎప్పుడు ముందుంటుందని తెలిపారు. కాంగ్రేస్‌పార్టీ ఎక్కువ కాలం అధికారంలో ఉందని దానికి ఒక లక్ష్యం లేదని కమ్యూనిస్టుపార్టీకి మాత్రం ఒక సిద్ధాంతం ఒక లక్ష్యం ఉన్నాయని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ప్రన్సిపాల్ ఎస్‌కె సలీం, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా నాయకులు యర్రా బాబు, దొండపాటి రమేష్, మండల సహాయ కార్యదర్శి స్వర్ణ రమేష్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆ ప్రచారం నమ్మకండి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాజ్యసభ సభ్యులు, బిఆర్‌ఎస్ నాయకులు వద్దిరాజు రవిచంద్ర కార్యాలయాలు, ఇండ్లపై విజిలెన్స్ దాడులు జరుగుతున్నాయన్న ప్రచారంలో వాస్తవం లేదని ఆయన వ్యక్తిగత సహాయకుడు ఇస్మాయిల్ తెలిపారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం జరుగుతుందని ఆ ప్రచారాన్ని నమ్మవద్దని ఆయన సూచించారు. ప్రస్తుతానికి ఎటువంటి విజిలెన్స్ దాడులు జరగడం లేదని ఆయన ప్రకటనలో తెలిపారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించండి

**-ఆర్‌ఎంకు ఎంప్లాయిస్ యూనియన్ వినతి**



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఆర్టిసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్‌ఎం సరిరాం నాయక్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు మాట్లాడుతూ ఆర్టిసిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై దృష్టిసారించాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ఎంప్లాయిస్ యూనియన్ ఖమ్మం రీజియన్ అధ్యక్ష, కార్యదర్శులు భూదాటి శ్రీనివాసరెడ్డి, పిల్లి రమేష్, డిపో నాయకులు దామాల లాజర్, చావా రమేష్, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## దెందుకూరు వైద్యసిబ్బంది బదిలీ









**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ :** సుదీర్ఘకాలంగా తెలంగాణ వైద్య,ఆరోగ్యశాఖ తరపున మధిర మండలంలోని పీ.హె చ్.సి. పరిధిలోని పలువురు సూపర్‌వైజర్, నర్సింగ్ అధికారి సిబ్బంది ఇటీవల తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సాధారణ బదిలీలో భాగంగా పీ.హెచ్.సీ. సిబ్బంది ఇటీవల రిలీవ్ అయి సోమవారం నూతన ప్రాంతాల్లో చేరారు. వీరిలో ప్రము ఖ ఆశమిత్ర సంఘ సేవకుడు లంకా కొండయ్య దెందుకూరు పీ.హెచ్.సీ.లో ఆరోగ్య పర్యవేక్షకుడిగా విధులు నిర్వహిస్తూ బార్యభర్తల జీఓ మీద బనిగండ్లపాడుకు, మధిర సెక్టార్ పరిధిలోని సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆర్.వి.సుబ్బలక్ష్మి మంచుకొండకు బదిలీ అయ్యారు. వీరితోపాటు మరో నలుగురు స్టాఫ్‌నర్సింగ్ అధికారులు రజనీ దెందుకూరు పీ.హెచ్.సీ.నుంచి మాటూరుపేటకు, టి.అ రుణకుమారి మధిర కమ్యూనిటీ ఆరోగ్యకేంద్రానికి, సృజన లంకాసాగర్ పీ.హెచ్.సీ.కు, అనూష బనిగండ్లపాడు పీ.హెచ్.సీ.కు బదిలీ అయ్యారు. ఈ మేరకు బదిలీ అయిన వైద్యసిబ్బందికి వైద్యులు పృధ్విరాజ్, సీ.హెచ్.ఓ.వి.వెంకటేశ్వర్లు,హెచ్.ఈ.ఓ. గోవింద్, ల్యాబ్‌టెక్నీషియన్ శ్రీనివాస్‌తోపాటు సిబ్బంది హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ బదిలీలు కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌పరిధిలో పారదర్శకంగా జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు.

## మహాకుంభాభిషేకాన్ని విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం:** జమలాపురం దేవస్థానంలో ఈనెల 29 నుంచి జూలై3 వతేదీ వరకు జరగనున్న ఆలయ జీర్ణోదరణ ధ్వజ ప్రతిష్ఠ సహిత మహాకుంభాభిషేకం కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆలయ ఈఓ కొత్తూరు జగన్‌మోహన్‌రావు, ఆలయ ధర్మకర్త ఉప్పల విజయదేవశర్మ, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస శర్మ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం వారు సమన్వయ సమావేశం నిర్వహించి పేర్కొన్నారు. శ్రీ పరాభవనామ సంవత్సరం జేష్ఠ పౌర్ణమి సోమవారం 29 నుంచి శ్రీ శృంగేరి శారదా పీఠం జగద్గురువులు శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థస్వామి ఆశీస్సులతో ఆలయంలో మహాకుంభాభిషేకం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయ నిర్మించి 50ఏళ్లు పూర్తియిన మేరకు ఈ మహాకుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలివేలుమంగ, పద్మావతి శివాలయంలోని ధ్వజస్తంభం శిథిలావస్థలో ఉన్నందున దాని స్థానంలో నూతన ధ్వజస్తంభం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు భక్తులు ఈనెల 29 నుంచి వచ్చేనెల 3వరకు నిర్వహించనున్న కార్యక్రమాల్లో భక్తులందరూ పాల్గొని అనుగ్రహం పొందాలని కోరారు. ఈ సమావేశంలో వెంకటాపురం సర్పంచి బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి, సుఖవాసి రమేశ్, ఎల్వి నారాయణరెడ్డి, నన్నపనేని రామారావు, సుధాకర్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఫుట్‌బాల్ శిక్షణా శిబిరం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫుట్‌బాల్ వేసవి శిక్షణా శిబిరం ముగిసింది. మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫుట్‌బాల్ మైదానంలో నిర్వహించిన శిక్షణా శిబిరం మంగళవారం ముగిసింది. క్యాంపు ఇంచార్జి బొబ్బిల్ల గోపిచంద్ పర్యవేక్షణలో నిర్వహించిన శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమంలో సర్పంచ్ కాపా ఆదినారాయణ ముఖ్య అతిథిగా హాజరై యువ ఫుట్‌బాల్ క్రీడాకారులను ప్రోత్సహించారు. శిబిరంలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఐదుగురు క్రీడాకారులను గుర్తించి ప్రత్యేకంగా సత్కరించారు. అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోపిచంద్ మాట్లాడుతూ శిబిరం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన గ్రామస్తులకు, తల్లిదండ్రులకు, క్రీడాకారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిబిరంలో మొత్తం 30 మంది బాలుర, బాలికల క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఆదర్శ్, బానోత్ కిషోర్, తోలపనూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.